శాస్త్రోక్తంగా భీష్మ ఏకాదశి వేడుకలు

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో శనివారం భీష్మ ఏకాదశి వేడుకలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. మొదట స్వామి అమ్మవార్లు, వళ్లీ, దేవసేన సమేత కుమారస్వామి ఉత్సవమూర్తులకు అలంకార మండపంలో అభిషేక పూజలు నిర్వహించారు. ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ పురవీధుల్లో ఊరేగించారు. సంప్రదాయం ప్రకారం విజ్ఞానగిరి వద్ద కొంతసేపు ఉత్సవమూర్తులను కొలువుదీర్చారు. పూజల అనంతరం శ్రీకాళహస్తీశ్వరాలయానికి చేరుకున్నారు. భక్తులు పెద్దసంఖ్యలో కర్పూర హారతులు సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు.



పురవీధుల్లో ఊరేగుతున్న స్వామి అమ్మవార్లు



తిరుపతిలో మీనాక్షి

ప్రముఖ సినీనటి మీనాక్షి చౌదరి శనివారం తిరుపతి వచ్చారు. నగరంలో ఓ షోరూమును ప్రారంభించిన ఆమె అక్కడ ఏర్పాటు చేసిన వేదికపై 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమా పాటలకు స్టెప్స్ వేస్తూ యువకుల్లో ఉత్సాహం నింపారు.అనంతరం మీడియాతో మాట్లాడారు. హీరో నందమూరి బాలకృష్ణ తనయుడు మోక్షజ్ఞ తొలి సినిమాలో హీరోయిన్‌గా మిమ్మల్ని అనుకుంటున్నట్లు సామాజిక మాధ్యమాల్లో ప్రచారం జరుగుతోందనగా తనకు ఈ విషయం తెలియదని, అవకాశం వస్తే తప్పక నటిస్తానన్నారు.

- తిరుపతి అర్బన్, ఆంధ్రజ్యోతి

డిప్యూటీ మేయర్ ఎన్నిక తిరుపతిలో రాజకీయ సమీకరణలను తారుమారు చేసింది.అధికారంలోకి వచ్చినా గతంలో వేధించిన వైసీపీ నాయకులను ఏమీ చేయలేకపోతున్నామని నిర్వేదంలో వున్న టీడీపీ శ్రేణుల అసంతృప్తిని ఈ ఎన్నిక దాదాపుగా పోగొట్టేసింది. అదే సమయంలో తిరుపతి టీడీపీలో నాయకత్వ కొరత కొట్టొచ్చినట్టు కనిపించింది. నూతన నాయకత్వాన్ని అందించడానికి ఇదే సరైన తరుణమన్న భావన శ్రేణుల్లో వ్యక్తమవుతోంది. - తిరుపతి, ఆంధ్రజ్యోతి



టీడీపీ శ్రేణుల్లో తగ్గిన అసంతృప్తి

- డిప్యూటీ మేయర్ ఎన్నికతో తిరుపతిలో బలం, పట్టు నిరూపించుకున్న పార్టీ
- వైసీపీ నేతల లొంగుబాటుతో ఆందోళనలో శ్రేణులు

వైసీపీ ప్రభుత్వ హయాంలో టీడీపీ శ్రేణులు అష్టకష్టాలు పడ్డాయి. చురుగ్గా పనిచేసే నాయకులు, కార్యకర్తలు ఎవరి పరిధిలో వారు మూల్యం చెల్లించుకోవాల్సి వచ్చింది. చాలా మంది వ్యాపారాలు, బతుకుదెరువు పోగొట్టుకుని ఆర్థికంగా చితికిపోయారు. మరికొందరు భౌతికంగా దాడులకు గురయ్యారు. అయితే కూటమి ప్రభుత్వం రాగానే గతంలో ఇబ్బంది పెట్టిన వారిని, అక్రమాలకు పాల్పడిన వారిని తాము కూడా ముప్పుతిప్పలు పెట్టాలని టీడీపీ శ్రేణులు ఉవ్విళ్లూరాయి. ఆరు నెలలు గడిచినా అలాంటిదేమీ జరగకపోగా కక్షసాధింపు చర్యలు వద్దని అధినేత చంద్రబాబు కట్టుబాటు విధించారు. దీంతో పార్టీ శ్రేణులు తీవ్ర నైరాశ్యంలో కూరుకుపోయాయి. స్థానికంగా నాయకత్వం లేకపోవడం, నామినేటెడ్ పదవులు దక్కకపోవడంతో పాటు కొత్తగా ఈ కట్టుబాట్లతో శ్రేణులు చప్పబడిపోయాయి. అలాంటి స్థితిలో డిప్యూటీ మేయర్ ఎన్నిక రావడం, ఒక కార్పొరేటర్ మాత్రమే ఉన్న టీడీపీ 25మంది వైసీపీ కార్పొరేటర్లను తనవైపు తిప్పుకుని గెలుపొందడం పార్టీ శ్రేణులకు ఊపిరి పోసినట్టయింది. ద్వితీయ శ్రేణి నాయకులు రంగంలోకి దిగి చురుగ్గా పనిచేసి ఎన్నికల్లో ఫలితాలను తారుమారు చేయడం కార్యకర్తల్లో స్థైర్యం నింపింది. వైసీపీ నాయకులను దీటుగా ఎదుర్కోగలమనే ధైర్యం కల్పించింది. గతంలో వైసీపీ నాయకుల దూకుడుకు, అక్రమాలకు సరైన సమాధానం చెప్పామన్న తృప్తి ఇపుడు శ్రేణుల్లో వ్యక్తమవుతోంది.

అనివార్యంగా బలపడిన జనసేన, బీజేపీ

టీడీపీతో పోలిస్తే తిరుపతిలో జనసేన, బీజేపీ బలం తక్కువ. దానికి తగ్గట్టుగానే డిప్యూటీ మేయర్ ఎన్నిక వ్యవహారంలో ఈ రెండు పార్టీలూ జోక్యం చేసుకోలేదు. జనసేన పార్టీ నాయకులు కొంతమేరకు పరోక్షంగా సహకారం అందించినా ప్రత్యక్షంగా మాత్రం రంగంలోకి దిగలేదు. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు కూడా ఎంత పాత్ర పోషించాలో అంతవరకే పరిమితమయ్యారు. ఇక బీజేపీ నేతలు పూర్తి దూరం పాటించారు. అయినా డిప్యూటీ మేయర్ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి ఆర్సీ మునికృష్ణ గెలుపొందడంతో ఆ మేరకు కూటమిలో భాగంగా జనసేన, బీజేపీ కూడా తిరుపతిలో బలపడినట్టయింది.

తాజా ఎన్నికతో వైసీపీ శ్రేణుల్లో ఆందోళన

తిరుపతిలో వైసీపీ సంస్థాగతంగా చాలా బలంగా ఉందన్న అభిప్రాయం మొన్నటి దాకా అందరిలో ఉండేది. నియోజకవర్గ నాయకత్వంతో పాటు డివిజన్ స్థాయిలో కూడా బలమైన నాయకులు ఉన్నారని రాజకీయ వర్గాలతో పాటు సామాన్య జనం కూడా భావించేవారు. డిప్యూటీ మేయర్ ఎన్నికతో అలాంటి అంచనాలన్నీ తలకిందులయ్యాయి. గత వైసీపీ ప్రభుత్వంలో దూకుడుగా వెళ్లి దౌర్జన్యాలు, అక్రమాలకు పాల్పడిన నాయకులపై ఈ ఎన్నికల్లో టీడీపీ నేతలు దృష్టి పెట్టడంతో దాదాపు అందరూ లొంగుబాటు ప్రకటించినంత పనిచేశారు. కొందరు ఎన్నికకు ముందే శిబిరం మార్చేయగా మరికొందరు చివరి క్షణంలో ప్లేటు ఫిరాయించారు. కొందరు తటస్తంగా ఉండిపోయారు. దీంతో 48మంది కార్పొరేటర్లున్న వైసీపీ బలం ఎన్నిక సమయానికి 21కి పడిపోయి పరాజయం పాలైంది. కూటమికి కిందిస్థాయి నాయకులు లొంగిపోయిన తీరుతో వైసీపీ శ్రేణులు బెంబేలెత్తుతున్నాయి. ఎవరిని నమ్ముకుని వచ్చే నాలుగున్నరేళ్ల పాటు వైసీపీలో కొనసాగాలన్న ఆలోచన వారిలో ఆందోళన కలిగిస్తోంది. ఇంతకాలం తిరుపతిలో వైసీపీ బలంగా ఉందని భావించిన వారు తాజా ఎన్నిక పరిణామాలతో అదంతా బలం కాదని అధికారాన్ని అడ్డుపెట్టుకోవడంతో బలంగా కనిపించిన వాపు మాత్రమేనన్న అభిప్రాయానికి వస్తున్నారు.

టీడీపీలో నూతన నాయకత్వానికి ఇదే తరుణం

తిరుపతిలో ఆవిర్భావం నుంచీ టీడీపీ బలంగా ఉంది. లేనిదల్లా బలమైన నాయకత్వం మాత్రమే. గతంలో కాంగ్రెస్, తర్వాత వైసీపీ నాయకులు టీడీపీ నాయకులను, కార్యకర్తలను ఇబ్బందులకు గురిచేసినా తట్టుకుని నిలబడ్డారే తప్ప భయపడి పార్టీ మారిన ఆనవాళ్లు పెద్దగా లేవు. అందుకే నాయకత్వం బలంగా లేకున్నా ఇంత కాలం పాటు పార్టీ నిలదొక్కుకుంది. నిజానికి 2019లో పార్టీ అభ్యర్థి ఓటమి చెందడం, ఐదేళ్లూ వైసీపీ అక్రమాలను బలంగా ఎదుర్కోలేకపోవడం, కిందటి ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థికి టికెట్ దక్కకపోవడం వంటి వరుస పరిణామాలతో తిరుపతిలో టీడీపీ బలహీనపడిందన్న అభిప్రాయం వ్యాపించింది.అయితే డిప్యూటీ మేయర్ ఎన్నికతో పార్టీ బలం ఏమాత్రం తగ్గలేదని నిరూపితమైంది.కాకుంటే ఇప్పటికీ పార్టీని నాయకత్వ కొరత వేధిస్తోంది. వాస్తవానికి జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్,చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నానీ తిరుపతిలోనే మకాం వేసి తెరవెనుక వ్యూహ రచన చేసి దాన్ని సమర్థవంతంగా అమలు చేయడం వల్లే డిప్యూటీ మేయర్ ఎన్నికలో టీడీపీ అభ్యర్థి గెలిచారు. ఎన్నికలకు నాలుగున్నరేళ్ల వ్యవధి ఉన్నందున ఇప్పుడే తిరుపతి టీడీపీలో కొత్త తరాన్ని,నూతన నాయకత్వాన్ని తయారు చేయాల్సిన తక్షణావసరముంది. ఆ దిశగా అధినేత చంద్రబాబు నిర్ణయం తీసుకోవాల్సిన అవసరముంది.

హోటల్ గ్రాండ్‌రిడ్జ్‌కు బాంబు బెదిరింపు

- చెన్నై నుంచి మెయిల్
- ఉలిక్కిపడ్డ పర్యాటకులు
- అంతా ఉత్తిదే అని తేల్చిన పోలీసులు



హోటల్ గ్రాండ్‌రిడ్జ్‌లో బాంబు, డాగ్ స్క్వాడ్ తనిఖీలు

తిరుచానూరు, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): తిరుచానూరు రోడ్డులోని శిల్పారామం వద్ద ఉన్న హోటల్ గ్రాండ్ రిడ్జ్‌కు శనివారం బాంబు బెదిరింపు కాల్ వచ్చింది. హోటల్ నిర్వాహకులతో పాటు బస చేసిన పర్యాటకులు ఆందోళనకు గురయ్యారు. పోలీసులు తనిఖీలు చేసి, ఫేక్‌కాల్‌గా నిర్ధారించారు. అచ్చి ముత్తు సవుక్కు శంకర్ అనే మెయిల్ ఐడీ నుంచి 'మీ హోటల్‌లో ఆర్‌డీఎక్స్‌తో కూడిన బాంబును అమర్చి పేల్చివేస్తాం' అని శనివారం వేకువజామున 2 గంటలకు మెయిల్ వచ్చింది. హోటల్ సిబ్బంది మధ్యాహ్నం 1.30గంటల ప్రాంతంలో గుర్తించారు. సాయంత్రం తిరుచానూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాంబ్ స్క్వాడ్, స్థానిక పోలీసులు అక్కడికి చేరుకుని సాయంత్రం 4.30 నుంచి రాత్రి 8 గంటల వరకు తనిఖీలు చేశారు. చివరకు ఫేక్ కాల్‌గా నిర్ధారించారు. ఈ ఘటనతో తిరుచానూరులో కలకలం రేగింది.

రామకృష్ణతీర్థ ముక్కోటి ఏర్పాట్లపై సమీక్ష

తిరుమల, ఫిబ్రవరి8(ఆంధ్రజ్యోతి): తిరుమలలో ఈనెల 12న జరుగనున్న రామకృష్ణతీర్థ ముక్కోటి ఏర్పాట్లపై టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి శనివారం తిరుమలలోని గోకులం మీటింగ్ హాల్‌లో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ యాత్రికుల కోసం రేడియో బ్రాడ్ కాస్టింగ్ ద్వారా ప్రకటనలు, డిస్‌ప్లే బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. భద్రత, అన్నప్రసాదం, తాగునీరు, వైద్య సదుపాయాలపైనా సమీక్షించారు. 12వ తేదీ ఉదయం 5 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మాత్రమే భక్తులకు అనుమతి ఉంటుందన్నారు. దీర్ఘకాలిక వ్యాధులున్న వారిని, వృద్ధులను, పదేళ్లలోపు చిన్నారులను అనుమతించబోమని స్పష్టం చేశారు.

15 మంది పోటు కార్మికులకు సూపర్‌వైజర్ల హోదా

తిరుమల, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి లడ్డూ ప్రసాదాల తయారీలో సమర్థవంతమైన పర్యవేక్షణ కోసం 15 మంది సీనియర్ పోటు కార్మికులకు సూపర్‌వైజర్ హోదా కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అంగీకారం తెలిపింది. శ్రీవారిని దర్శించుకునే భక్తుల సంఖ్య రోజురోజుకూ పెరగడంతో లడ్డూ ప్రసాదానికి డిమాండ్ అధికమైంది. దీనికి అనుగుణంగా ఎప్పటికప్పుడు పోటు కార్మికులను టీటీడీ నియమించుకుంటూ వస్తోంది. ఎఫ్ఎస్ఎస్ఏఐ నిబంధన ప్రకారం ప్రతి 25 మంది సిబ్బందికి ఒక పర్యవేక్షకుడు అవసరం. దీనికి అనుగుణంగా 15 సూపర్‌వైజర్ పోస్టులను క్రియేట్ చేసేందుకు అనుమతి కోరుతూ టీటీడీ ఈవో ఇటీవల ప్రభుత్వానికి లేఖ సమర్పించారు. అంగీకారం తెలుపుతూ ప్రభుత్వ సెక్రటరీ వినయ్‌చంద్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు.

పెలికాన్ పక్షి మృతి

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని ఫారెస్టు కార్యాలయానికి కూతవేటు దూరంలో ఉన్న ఉల్సావడవ చెరువులో పెలికాన్ పక్షి మృతి చెందింది. ఎప్పుడో మృతి చెందిన పక్షి కళేబరం శనివారం బయటపడింది. స్థానికులు గుర్తించి ఫారెస్టు అధికారులకు సమాచారం అందించారు. సిబ్బంది చెరువు వద్దకు చేరుకుని పక్షి కళేబరాన్ని వెలికితీశారు. వారం రోజుల ముందు మృతి చెంది ఉంటుందని చెబుతున్నారు. పోస్టుమార్టానికి పంపి మృతికి గల కారణాలు తెలుసుకుంటామన్నారు.



మృతి చెందిన పెలికాన్ పక్షి

సమస్యల పరిష్కారానికి నిరంతర కృషి

● ఎమ్మెల్యే నాని


అర్జీదారుతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాని

తిరుచానూరు, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే పులివర్తి నాని తెలిపారు. రఘునాథ్‌రిసార్ట్స్‌లోని నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో శనివారం మధ్యాహ్నం ఆయన ప్రజాదర్బార్ నిర్వహించారు. నియోజకవర్గ ప్రజలు తమ సమస్యలను అర్జీల రూపంలో ఎమ్మెల్యేకు వివరించారు. వినతిపత్రాలు స్వీకరిస్తూ సంబంధిత అధికారులకు పరిష్కరించాలని నాని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి సోమవారం అధికారులు చేపట్టే సమస్యల పరిష్కార వేదికకు అదనంగా దీనిని నిర్వహిస్తున్నామన్నారు. గత పాలకులు అనుసరించిన దుర్మార్గపు విధానాలకు పల్లెల్లో ప్రశాంతత లేకుండా సమస్యలతో సతమతమయ్యారన్నారు. వారి సమస్యలను పరిష్కరించడమే ధ్యేయమన్నారు. ప్రతిశనివారం ప్రజాదర్బార్ నిర్వహిస్తామన్నారు. కూటమి నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

అవకాశాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలి


సమావేశంలో మాట్లాడుతున్న సుధారెడ్డి

పాకాల, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): మహిళలు అవకాశాలను సద్వినియోగం చేసుకొని అన్ని రంగాలలో ఎదగాలని ఎమ్మెల్యే పులివర్తి నాని సతీమణి సుధారెడ్డి కోరారు. కెవడ్డేపల్లె, అచ్చమ్మ అగ్రహారం, కావలివారిపల్లెలో శనివారం ఆమె మహిళలతో సమావేశాలు నిర్వహించారు.. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డ్వాక్రా మహిళలు రుణాలు పొంది తిరిగి చెల్లించడం వరకే పరిమితం కాకూడదన్నారు. వ్యాపారాలు, పాడి పరిశ్రమలు, మార్కెటింగ్ లాంటి వాటిలో శిక్షణ పొంది రాయితీ రుణాలు తీసుకొని చక్కని ప్రణాళికలతో అభివృద్ధి సాధించాలన్నారు. ఆదివారం ఇరంగారిపల్లె పంచాయతీ తలారిపల్లెలో, చెన్నుగారిపల్లెలో, సామిరెడ్డిపల్లెలో మహిళలతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించనున్నారు. కార్యక్రమంలో జడ్పీటీపీ నంగా పద్మజరెడ్డి, సర్పంచ్ కె.వరలక్ష్మీ, మండల టీడీపీ కన్వీనర్ బి.నాగరాజనాయుడు, కార్యదర్శి ఫల్గుణ, రమేష్‌బాబు, బి.మహేష్ కుమార్, కె.సావిత్రి, రాజ్యలక్ష్మీ, శశికళ, ఎం.వెంకటేష్‌బాబు తదతరులు పాల్గొన్నారు.

తిరుచ్చిపై కల్యాణ వెంకన్న దర్శనం



చంద్రగిరి, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): శ్రీనివాసమంగాపురంలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయం శనివారం సాయంత్రం తిరుచ్చి వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం 10.30 గంటలకు ఉత్సవర్లను కల్యాణ మండపంలో వేంచేపు చేసి ఆగమ శాస్త్రోక్తంగా ఉత్సవర్లకు కల్యాణోత్సవం నిర్వహించారు. సాయంత్రం ఆ ఉత్సవర్లకు ఊంజల్ సేవను కన్నులపండువగా నిర్వహించారు. అనంతరం శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఉత్సవర్లను విశేషంగా అలంకరించి, తిరుచ్చి వాహనంపై అధిష్ఠించారు. అనంతరం శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి తిరుచ్చి వాహనంపై ఆలయ నాలుగు మాడ వీధుల్లో భక్తులకు దర్శనమిచ్చారు.

రెండు ఎక్స్‌కవేటర్లు, మూడు టిప్పర్ల సీజ్

చంద్రగిరి, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని స్వర్ణముఖినదిలో జరుగుతున్న ఇసుక అక్రమ రవాణా కట్టడికి రెవెన్యూ, పోలీసులు బృందంతో దాడులు నిర్వహిస్తున్నారు. అయినా అక్రమ రవాణా ఆగడంలేదు. స్వర్ణముఖినదిలో రెడ్డివారిపల్లె, చంద్రగిరిలోని కేశవరెడ్డి స్కూల్ వద్ద ఎక్స్‌వేటర్ల సాయంతో టిప్పర్ల ద్వారా ఇసుకను తరలిస్తున్నారని తహసీల్దార్ శివరామసుబ్బయ్య, సీఐ సుబ్బరామిరెడ్డిలకు సమాచారం అందింది. దీంతో రెవెన్యూ సిబ్బంది, పోలీసులు సంయుక్తంగా శుక్రవారం రాత్రి దాడులు నిర్వహించారు. రెండు ఎక్స్‌వేటర్లు, మూడు టిప్పర్లు పట్టుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

గ్రంథాలయ పునర్వికాస ఉద్యమం అవసరం

● అరసం నేత పెనుగొండ లక్ష్మీనారాయణ


పెనుగొండ లక్ష్మీనారాయణ, సాకం నాగరాజ తదితరులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 8 (ఆంధ్ర జ్యోతి): గ్రంథాలయ పునర్వికాస ఉద్యమం చేపట్టాల్సిన అవసరం ఉందని అభ్యుదయ రచయితల సంఘం (అరసం) జాతీయ అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీనారాయణ, గ్రంథాలయ పునర్వికాస ఉద్యమ రాష్ట్ర కన్వీనర్ వల్లూరి శివప్రసాద్ పేర్కొన్నారు. తిరుపతిలోని పలు సాహిత్య, సాంస్కృతిక సంస్థల ప్రతినిధులతో శనివారం వారు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వందేళ్ల క్రితం రాష్ట్రంలో గ్రంథాలయ ఉద్యమం సాగిందన్నారు. సామాజిక చైతన్యానికీ, సంఘ సంస్కరణకు కూడా ఆ ఉద్యమం దోహదం చేసిందన్నారు. రెండు దశాబ్దాలుగా గ్రంథాలయ నిధులు పక్కదారి పడుతున్నాయన్నారు. ప్రభుత్వ గ్రంథాలయాల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలన్నారు. గ్రంథాలయ పునర్వికాస ఉద్యమానికి పది సాహిత్య, సాంస్కృతిక సంఘాలు సంఘీభావాన్ని ప్రకటించాయి. ఈ వేదిక జిల్లా కన్వీనర్‌గా పేరూరు బాలసుబ్రమణ్యంను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో అరసం నాయకులు సాకం నాగరాజ, యువశ్రీ మురళి, నెమిలేటి కిట్టన్న, టింకాయల దామోదరం, మల్లారపు నాగార్జున, ఆర్వీ కృష్ణస్వామిరాజు, మూరిశెట్టి గోవిందు, వాకా ప్రసాద్, పల్లెపట్టు నాగనాగరాజు, కెవి మేఘనాథరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో జోరుగా అభివృద్ధి పనులు

● రూ.5.42 కోట్లతో పలు నిర్మాణాలు


తుమ్మలగుంటలో జెడ్పీహైస్కూల్ సమీపంలో సీసీరోడ్డు పనులు

తిరుపతిరూరల్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): రూరల్ మండలంలో పలు అభివృద్ధి పనులు శరవేగంగా సాగుతున్నాయి. గత వైసీపీ ఐదేళ్ల పాలనలో గ్రామ పంచాయతీలకు కనీస నిధులు కూడా మంజూరు కాలేదు. దీంతో చిన్న చిన్న పనులు కూడా చేపట్టలేకపోయేవారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక పంచాయతీలు ప్రాణం పోసుకుంటున్నాయి. ఎమ్మెల్యే పులివర్తి నాని చొరవతో ఎన్ ఆర్ ఈ జీ సీ, ఇతర నిధులు రూ.5.42కోట్లతో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. మండలంలో 72 పనులను గుర్తించారు. తొలి విడతగా 24 సచివాలయాల పరిధిలో ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.3.99కోట్లతో 11కిలోమీటర్లకుపైగా 45సీసీరోడ్లని నిర్మిస్తున్నారు. ఇప్పటికే 80శాతం పనులు పూర్తయ్యాయి. పేరూరు పంచాయతీలో ఆక్రమణలకు గురవుతున్న శ్మశానస్థలాన్ని సర్వేచేసి హద్దు నిర్ధరించారు. ప్రహరీని నిర్మిస్తున్నారు. తొండవాడ వద్ద స్వర్ణముఖినది నుంచి సి.మల్లవరం మీదుగా గ్రామానికి నీరువచ్చే సప్లైఛానల్స్‌ను పునరుద్ధరించారు. ఫలితంగా పేరూరు చెరువు జలకళ సంతరించుకుంది. వెంకటపతినగర్ పంచాయతీపరిధిలో అయాన్‌డిజిటల్ కేంద్రానికి సమీపంలో రూ.3లక్షల జీపీనిధులతో యాడీఎస్ ఏర్పాటు చేశారు. అభివృద్ధి పనులపై ప్రజలు సంతోషం వ్యక్తపరుస్తున్నారు.


పేరూరులో శ్మశానవాటికకి ప్రహరీ నిర్మాణం

సముద్ర తాబేళ్ల సంరక్షణకు సమన్వయంతో పనిచేయాలి

● పీసీసీఎఫ్ ఏకే నాయక్


సముద్ర తాబేళ్ల సంరక్షణకు సంబంధించిన బుక్‌లెట్‌ను ఆవిష్కరిస్తున్న పీసీసీఎఫ్ ఏకే నాయక్ పక్కనే డీఎఫ్‌వోలు

నెల్లూరు(వ్యవసాయం), ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): సముద్ర తాబేళ్ల సంరక్షణకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్(పీసీసీఎఫ్) ఏకే నాయక్ పేర్కొన్నారు. అటవీ శాఖ, ట్రీ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం నెల్లూరు రూరల్ మండలం గొలగమూడి రోడ్డులోని వీపీఆర్ కన్వెన్షన్‌లో సముద్ర తాబేళ్ల సంరక్షణపై అవగాహన సదస్సు జరిగింది. ముఖ్య అతిథిగా ఆయన పాల్గొని మాట్లాడుతూ సముద్ర జలాలను శుభ్రపరచడంలో తాబేళ్ల పాత్ర ఎంతో కీలమని చెప్పారు. వందల సంవత్సరాలు జీవించే తాబేళ్లు మానవుడి తప్పిదాల కారణంగా మృత్యువాత పడుతున్నాయన్నారు.ముఖ్యంగా మరబోట్ల కారణంగా చనిపోతున్నాయని తెలిపారు. అదేవిధంగా చేపలు కోసం వినియోగించే కొన్ని వలల కారణంగా కూడా అధికంగా మృత్యువాత పడుతున్నాయన్నారు. సముద్రంలో 8 నాటికల్ మైళ్ల అవతల మరబోట్లతో చేపలవేట సాగించాలని చట్టాలు చెబుతున్నా, వాటిని కొంతమంది మత్స్యకారులు పాటించడం లేదని చెప్పారు. వీటిపై ప్రభుత్వానికి నివేదించనున్నట్లు తెలియజేశారు. తాబేళ్ల గుడ్లను కూడా అటవీశాఖ ఆధ్వర్యంలో ఉన్న హేచరీలలో 48రోజుల పాటు సంరక్షించి ఆతరువాత పిల్లలను సముద్ర జలాల్లో వదులుతున్నామని వివరించారు. మత్స్యశాఖ, కోస్ట్‌గార్డ్స్, మెరైన్ పోలీసులతోపాటు స్వచ్ఛంద సంస్థలు కూడా తాబేళ్ల సంరక్షణకు కృషి చేయాలని ఆయన తెలియజేశారు. తాబేళ్ల సంరక్షణకు అవసరమైన అంశాలపై సమావేశంలో చర్చించారు. ఈసమావేశంలో గుంటూరు, తిరుపతి అటవీశాఖ కన్జర్వేటర్లు రాజు, సెల్వంలతోపాటు నెల్లూరు, సూళ్లూరుపేట, ప్రకాశం, బాపట్ల డీఎఫ్‌వోలు మహబూబ్‌బాషా, హారిక, వినోద్, వేమయ్య, నెల్లూరు రేంజ్ ఆఫీసర్ మాల్యాద్రితోపాటు మత్స్యశాఖ, ఇండియన్ కోస్ట్‌గార్డ్, మెరైన్ పోలీసులు, మత్స్యకారులు, మత్స్యకార సంఘాల నాయకులు పాల్గొన్నారు.

బీజేపీ సంబరాలు

చంద్రగిరి, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో బీజేపీ నాయకులు సంబరాలు చేసుకొన్నారు. ఢిల్లీ ఎన్నికలో ఘన విజయం సాధించినందుకు శనివారం ఆ పార్టీ నాయకులు బాణాసంచి కాల్చి, స్వీట్లు పంచిపెట్టారు. ఈసందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటముని మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోడి అభివృద్ధిని చూసి ప్రజలు బీజేపీని ఆదరిస్తున్నారన్నారు. పార్టీ రాష్ట్ర మాజీ కార్యవర్గ సభ్యులు సుబ్రమణ్యంయాదవ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి, ఆప్ పార్టీకి ఢిల్లీ ఫలితాలు చెంప పెట్టు అని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు పురుషోత్తంరెడ్డి, నాయకులు సునీల్‌కుమార్ యాదవ్, దొరస్వామి, నరేష్‌కుమార్‌నాయుడు, కృష్ణమూర్తినాయుడు, ప్రసాద్, మోహనరాజు, ఇందుశేఖర్, నవీన్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నడుస్తున్న బస్ ఎక్కుతూ కిందపడి గాయాలు



చంద్రగిరి, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తూ కాలుజారి బస్సు చక్రం కింద పడి గాయపడ్డాడో వ్యక్తి. పోలీసుల కథనం మేరకు తిరుపతికి చెందిన షేక్ షఫీ శనివారం చంద్రగిరి బంధువుల ఇంటికి వచ్చాడు. తిరిగి వెళ్లేందుకు సాయంత్రం టవర్ క్లాక్ వద్ద బస్ కోసం వేచివున్నాడు. అదే సమయంలో వస్తున్న పుంగనూరు డిపో ఆర్టీసీ బస్సును ఆపాడు. డ్రయివర్ గమనించి బస్ వేగం తగ్గించాడు. దీంతో షేక్ షఫీ పరిగెత్తుకొంటూ వెళ్లి ఫుట్‌పాత్‌పై కాలుపెట్టే క్రమంలో పడ్డాడు. ఈ క్రమంలో బస్సు వెనుక చక్రం షఫీ కాలుపై దూసుకుపోయింది. స్థానికులు వెంటనే గుర్తించి షఫీని బర్డ్ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు విచారిస్తున్నారు.

మైనారిటీల సంక్షేమమే టీడీపీ ధ్యేయం

రాష్ట్ర మైనారిటీ సంక్షేమ సలహాదారు ఎంఏ షరీఫ్


సమావేశంలో మాట్లాడుతున్న ఎంఏ షరీఫ్

చిత్తూరు సిటీ, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): మైనారిటీల సంక్షేమమే ధ్యేయంగా టీడీపీ ముందుకెళుతోందని రాష్ట్ర మైనారిటీ సంక్షేమ సలహాదారు ఎంఏ షరీఫ్ అన్నారు. శనివారం జిల్లా పార్టీ కార్యాలయంలో ముస్లిం సోదరుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. టీడీపీ హయాంలో సీఎం చంద్రబాబు రాష్ట్ర వ్యాప్తంగా షాదీఖానాలు, ఉర్దూ యూనివర్సిటీలు, పాఠశాలలు ఏర్పాటు చేశారన్నారు. వివాహం చేసుకునే ముస్లిం మహిళలకు దుల్హన్ పథకం కింద రూ.లక్ష ఇచ్చి ప్రోత్సహించారని చెప్పారు. మసీదు భూముల్ని కాపాడి ముస్లింలకు వాటిపై హక్కు కల్పించిన ఘనత చంద్రబాబుదేనని ప్రశంసించారు. మాజీ సీఎం జగన్‌రెడ్డి ముస్లింలను ఓటు బ్యాంకుగా మాత్రమే చూశారని మండిపడ్డారు. చిత్తూరులోని బాలికల గురుకుల పాఠశాలకు తన సొంత డబ్బుతో హీటర్లు, బెడ్‌షీట్లు ఇస్తామని చెప్పిన ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌కు ధన్యవాదాలు తెలుపుతున్నామని చెప్పారు. కూటమి ప్రభుత్వంలో ముస్లిం మైనార్టీలు మరింత అభివృద్ధి చెందుతారని అన్నారు. మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, చుడా చైర్‌పర్సన్ కటారి హేమలత, సివిల్ సప్లయిస్ రాష్ట్ర డైరెక్టర్ పర్వీన్ తాజ్, నేతలు షేక్ ఉమర్, రాధా కృష్ణ, సప్తగిరి ప్రసాద్, మోహన్‌రాజ్, ఖాజా పీర్, ఫిరోజ్, అత్తూబాయ్, జిలాని, అన్సర్, జాఫర్, ఉస్మాన్, అక్బర్, రాజశేఖర్, చింటూ, రఘు, జైపాల్ పాల్గొన్నారు.

లారీ, ఆటో ఢీ

● వధూవరులు సహా 10మందికి గాయాలు


చిత్తూరు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు



గంగాధర నెల్లూరు, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : గంగాధర నెల్లూరు సమీపంలో శనివారం రాత్రి లారీ,ఆటో ఎదురెదురుగా ఢీకొన్న ప్రమాదంలో పదిమంది గాయపడ్డారు.పోలీసుల కథనం మేరకు...గంగాధరనెల్లూరు మండలం అగరమంగళం దళితవాడకు చెందిన బాబు కుమార్తె కవితకు, యాదమరి మండలం కీనాటంపల్లె పంచాయతీ గుట్టపై (కోడూరు) దళితవాడకు చెందిన మణి కుమారుడు రాము(రామన్)కు యాదమరిలో శుక్రవారం ఉదయం వివాహం జరిగింది. ఈ నేపథ్యంలో వధూవరులతో పాటు వరుడి బంధువులు శనివారం మధ్యాహ్నం ఆటోలో వధువు ఇంటికి మరివేలు(డిన్నర్)కు వచ్చారు.తిరిగి రాత్రి అగరమంగళం దళితవాడ నుంచి యాదమరిలోని వరుడి ఇంటికి బయల్దేరారు. ఆటోలో వధూవరులతో పాటు 11మంది బంధువులు న్నారు.గంగాధర నెల్లూరు సమీపంలో వీరి ఆటో ఎదురుగా వస్తున్న లారీని ఢీకొనడంతో 10మంది గాయపడ్డారు.వీరిలో వధూవరులతో పాటు కోదండన్, పెరియస్వామి, చిత్ర, సఖి,శివమ్మ,రజన, రాబిన్, పవిత్ర వున్నారు.వీరిలో పెరియస్వామి పరిస్థితి ఆందోళనకరంగా వుంది. గాయపడ్డవారందరినీ చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నట్లు ఇన్‌చార్జి సీఐ శ్రీనివాసంతి తెలిపారు. పెరియస్వామిని మెరుగైన చికిత్స నిమిత్తం వేలూరు సీఎంసీకి తరలించినట్లు తెలిపారు.


దయనీయతకు దర్పణం పడుతున్న వసతి గది- అపరిశుభ్రంగా మరుగుదొడ్లు - పాడైన నీటిమోటారు

అధ్వాన హాస్టల్

పాకలలోని బీసీ సంక్షేమశాఖ కళాశాల బాలుర వసతి గృహంలో మౌలిక సదుపాయాలు లేక విద్యార్థులు ఇబ్బందిపడుతున్నారు. ఈ వసతి గృహంలో బీటెక్, డిప్లొమా, డిగ్రీ, ఇంటర్ చదువుతున్న 50 మంది విద్యార్థులు ఉన్నారు. నాలుగు రోజుల క్రితం బోరు మోటారు పాడైంది. మరమ్మతులు చేయించకపోవడంతో నీటికోసం అవస్థలు తప్పడంలేదు. పంచాయతీ కుళాయి నీటికోసం పడిగాపులు పడుతున్నారు. పాత భవనం కావడంతో లోపలి గోడలు పెచ్చులూడిపోతున్నాయి. మరుగుదొడ్లు, స్నానపు గదులు అపరిశుభ్రంగా ఉన్నాయి. 50 మంది 4 గదుల్లోనే సర్దుకుంటున్నారు. అధికారుల పర్యవేక్షణ సక్రమంగా లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి భవనానికి మరమ్మతులు చేపట్టాలని, మోటారుకు మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు.

- పాకాల,(ఆంధ్రజ్యోతి)

న్యాయవ్యవస్థపై నమ్మకాన్ని పెంచాలి


వేదికపై న్యాయమూర్తులు, అతిథులు- కోర్టు భవనాల సముదాయాన్ని ప్రారంభిస్తున్న సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకటనారాయణ భట్, హైకోర్టు ఛీఫ్ జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్

పలమనేరు, ఫిబ్రవరి8 (ఆంధ్రజ్యోతి) : సమస్యలతో వచ్చే ప్రజలకు సకాలంలో న్యాయం అందించడం ద్వారా న్యాయవ్యవస్థపై నమ్మకం కలిగించాల్సిన బాధ్యత అందరిపై వుందని సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ సరస వెంకట నారాయణ భట్ పేర్కొన్నారు. పలమనేరులో రూ. 15.18 కోట్లతో నిర్మించిన నాలుగు కోర్టు భవనాల సముదాయాన్ని, నలుగురు న్యాయమూర్తుల నివాస భవనాల సముదాయాన్ని హైకోర్టు చీఫ్ జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్‌తో కలిసి శనివారం ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మదనపల్లెవాసిగా ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని పలువురు న్యాయవాదులతో తనకు సత్సంబంధాలున్నాయన్నారు.పలమనేరులో మెరుగైన మౌలిక సదుపాయాలతో న్యాయస్థాన భవనం నిర్మించడం జరిగిందన్నారు. న్యాయవాదుల్లో నూతనోత్సాహాన్ని పెంపొందించడానికి, ప్రజలకు న్యాయవ్యవస్థపై మరింత నమ్మకం కలిగించడానికి స్వయంగా ఈ కార్యక్రమానికి హాజరయ్యానన్నారు.హైకోర్టు చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ మాట్లాడుతూ పలమనేరులో కోర్టు భవనాల సముదాయాన్ని ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. అంతకుముందు వీరికి కలెక్టర్ సుమిత్‌కుమార్,ఎస్పీ మణికంత స్వాగతం పలకగా పురోహితులు పూర్ణకుంభ స్వాగతం పలికారు.అనంతరం జస్టిస్ వెంకటనారాయణ భట్ పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. సర్వమత ప్రార్థనలు చేసిన తరువాత నూతన భవనాల సముదాయాలను ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో హైకోర్టు జడ్జి, చిత్తూరు అడ్మినిస్ట్రేషన్ జడ్జి జస్టిస్ కృష్ణమోహన్, హైకోర్టు జస్టిస్ టీసీడీ శేఖర్, చిత్తూరు జిల్లా ప్రధాన న్యాయమూర్తి భీమారావు, తిరుపతి మూడవ అదనపుజిల్లా జడ్జి గురునాథ్, చిత్తూరు అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి ఎస్.పి.డి. వెన్నెల ,డీఎల్ఎస్ఏ సెక్రటరీ భారతి, పలమనేరు సివిల్ జడ్జి ఆదినారాయణ, సివిల్ జడ్జి లిఖిత, స్పెషల్ మెజిస్ట్రేట్ రాధమ్మ, ఆర్డీవో భవాని, ఏపీ బార్ కౌన్సిల్ ఛైర్మన్ నల్లారి ద్వారకనాథరెడ్డి, పలమనేరు బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కె. లక్ష్మీపతి,న్యాయవాదులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా పలమనేరులో అడిషనల్ జిల్లా సెషన్స్ జడ్జి కోర్టు ఏర్పాటు చేయాలని కోరుతూ హైకోర్టు చీఫ్ జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్‌కు,జస్టిస్ బి.కృష్ణమోహన్‌కు పలమనేరు, కుప్పం బార్ అసోసియేషన్ అధ్యక్షులు వినతిపత్రం అందజేశారు.


పుస్తకాలు చూస్తున్న సందర్శకులు

నేటితో ముగియనున్న పుస్తక ప్రదర్శన

● పెరుగుతున్న సందర్శకుల తాకిడి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): పది రోజులుగా తిరుపతిలో వైభవంగా సాగిన పుస్తక ప్రదర్శన ఆదివారంతో ముగియనుంది. దీంతో శనివారం సందర్శకుల తాకిడి పెరిగింది. సాయంత్రం నిర్వహించిన సభలో ఎస్వీయూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎం. భూపతి నాయుడు మాట్లాడుతూ కొత్త తరం పుస్తకాలను చదివే అలవాటును పెంపొందించుకోవడం సంతోషకరమన్నారు. ఐజర్ ప్రొఫెసర్ విజయమోహన్ పిళ్ళై మాట్లాడారు.. అతిథులను పుస్తక ప్రదర్శన నిర్వాహకులు సత్యనారాయణరాజు సత్కరించారు. ఆచార్య దక్షిణామూర్తిశర్మ, స్విమ్స్ డీన్ అల్లాడి మోహన్, పలువురు పుస్తక, సాహిత్య అభిమానులు పాల్గొన్నారు. టెలిస్కోప్ ద్వారా చూసే ఖగోళాన్ని చూసే కార్యక్రమానికి విశేష స్పందన వచ్చింది. చిన్నారుల విష్ణు సహస్రనామ పారాయణం ఆకట్టుకుంది. 'బాలల నేస్తం' మాస పత్రికను ఎస్వీయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ భూపతి నాయుడు, భారతీయ విద్యా భవన్ డైరెక్టర్ సత్యనారాయణరాజు, అభ్యుదయ రచయితల సంఘం జాతీయ అధ్యక్షులు పెనుగొండ లక్ష్మీనారాయణ, రాష్ట్ర కార్యదర్శి వల్లూరు శివప్రసాద్ తదితరులు ఆవిష్కరించారు.

● మంచి పుస్తకమే గొప్ప స్నేహితుడు : కలెక్టర్


తన కుమార్తెకు పుస్తకాన్ని చూపుతున్న కలెక్టర్ వేంకటేశ్వర్

తిరుపతి(విశ్వవిద్యాలయాలు),ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): మంచి పుస్తకం గొప్ప స్నేహితుడు వంటిదని కలెక్టర్ డాక్టర్ వేంకటేశ్వర్ అన్నారు. నగరంలో పుస్తక ప్రదర్శనను శనివారం ఆయన కుటుంబ సభ్యులతో కలిసి సందర్శించారు. వివిధ పుస్తక విక్రయ కేంద్రాలను, పుస్తకాలను చూశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పుస్తక పఠనం మంచి అలవాటు అన్నారు. ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో పుస్తక పఠనానికి ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు.

● పుస్తక ప్రపంచం
జన విజ్ఞాన వేదిక (జేవీవీ)

1988లో ఆవిర్భవించిన జన విజ్ఞాన వేదిక (జేవీవీ) పుస్తకాల ద్వారా ప్రజల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించేందుకు విశేష కృషి చేస్తోంది. జేవీవీ ఇప్పటి వరకూ సుమారు 70 పుస్తకాలు ప్రచురించింది. తాజాగా తిరుపతి పుస్తక ప్రదర్శనలో 40 పుస్తకాలను అందుబాటులో ఉంచింది. మ్యాపిల్, ప్యారగాన్, జైన్ అండ్ కో వంటి సంస్థలు ప్రచురించిన పుస్తకాలను కూడా ఇక్కడ దొరుకుతున్నాయి. స్టాల్ నెంబరు -28లో జేవీవీ స్టాల్ ఉంది.

● పుస్తక ప్రదర్శనలో అరసం నేతలు


పుస్తక ప్రదర్శనకు వచ్చిన అరసం అధి నాయకులు

అభ్యుదయ రచయితల సంఘం జాతీయ అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీనారాయణ, రాష్ట్ర కార్యదర్శి, రచయిత వల్లూరు శివప్రసాద్, రాష్ట్ర అధ్యక్షవర్గ సభ్యులు సాకం నాగరాజ, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు యువశ్రీ మురళి, నెమిలేటి కిట్టన్న తదితరులు పుస్తక ప్రదర్శన కేంద్రాన్ని సందర్శించారు.


● నేనేం చదువుతున్నానంటే?



కవిత్వం రాస్తున్నా కథలు, నవలలు ఎక్కువగా చదువుతాను. శివారెడ్డి ప్రేమ గీతం కవితా సంపుటి చదివాను. మానవ హక్కుల నేత బాలగోపాల్ 'రూపం-సారం' పుస్తకం ఆలోచింపచేస్తుంది. కొన్ని పుస్తకాలను ఒకసారి చదివి పడేయకుండా, మళ్లీ మళ్లీ చదువుతాను. ఇలాంటి వాటిలో కారల్ మార్క్స్ క్యాపిటల్ కూడా ఒకటి. పలమనేరు బాలాజీ 'ఏకలవ్య ఎరుకుల కాలనీ', మూరిశెట్టి 'నాడోడి బతుకు' రచనలు చదివాను.

- పల్లిపట్టు నాగరాజు, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత

● మన పుస్తకం



పాయిదరువులు

పలమనేరు సమీపంలోని కాలువపల్లె గ్రామానికి చెందిన కేవీ మేఘనాథరెడ్డి పాయిదరువులు నవల రాశారు. జిల్లాలోని యానాది జీవితం ఇతివృత్తమిది. పల్లె యాసలో నవల సాగుతుంది. గతేడాది ఆగస్టులో ఈ పుస్తకం వెలువరించారు. మేఘనాథరెడ్డి రాసిన తొలి నవల ఇది. భారతీయ గిరిజన సాహిత్యంలో పాయిదరువుల నవలు గొప్ప చేర్పు. యానాదుల జీవితాన్ని దగ్గరగా పరిశీలించి, ఒక రకంగా పరిశోధించి ఈ రాసినట్టుగా అనిపిస్తుంది. 115 పేజీల ఈ పుస్తకం ధర రూ.120. పుస్తక ప్రదర్శనలో స్టాల్ నెంబరు-56లో లభ్యమవుతుంది.

● వివాదం

పుస్తక ప్రదర్శనలోని కొన్ని విక్రయ కేంద్రాల్లో హిందూయేతర మతాలకు చెందిన పుస్తకాలను విక్రయించడం పట్ల కొన్ని హిందూ సంఘాలకు చెందిన వారు ఆందోళన,అభ్యంతరం వ్యక్తం చేశారు.ఈ విషయాన్ని నిర్వాహకుల దృష్టికి తీసుకుపోగా భారతీయ సంస్కృతీ, సంప్రదాయాల పరిరక్షణ లక్ష్యంతో భారతీయ విద్యా భవన్ పని చేస్తూ ఉందనీ, పుస్తక ప్రదర్శనలో ఇతర మతాలకు చెందిన గ్రంథాలను విక్రయించవద్దని నిర్వాహకులు సత్యనారాయణరాజు సూచించారు. ఈ నిబంధనను అతిక్రమించిన వారి స్టాల్‌ను ప్రదర్శన నుంచీ తొలగిస్తామని ఆయన స్పష్టం చేయడంతో ఆందోళనకారులు శాంతించారు. అయితే ప్రశాంతంగా ఉన్న తిరుపతి వాతావరణాన్ని కొంతమంది ఇలాంటి చర్యలతో కలుషితం చేయడం తగదని సీపీఐ, సీపీఎం జిల్లా కార్యదర్శులు మురళి, నాగరాజు ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. పుస్తక ప్రదర్శనపై దాడి చేసిన వారిని అరెస్టు చేయాలని కోరారు.

వరుస చోరీలపై ఎస్పీ సీరియస్

తిరుపతి(నేరవిభాగం),ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): వరుస చోరీ ఘటనలను జిల్లా ఎస్పీ సీరియస్‌గా తీసుకున్నారు. దొంగల ముఠాలు గుర్తింపునకు క్రైం అదనపు ఎస్పీ నాగభూషణం ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ఇప్పటికే ఈబృందాలు వివిధ ప్రాంతాల్లో గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. క్రైం డీఎస్పీ శ్యాంసుందర్‌కు గతంలో ఇక్కడ పనిచేసిన అనుభవం ఉండడంతో ప్రత్యేక ఫోకస్ పెట్టారు. ముంగిలిపట్టు కేసు కొలిక్కి వచ్చిన నేపథ్యంలో సీపీఆర్ అపార్టుమెంటులో మాత్రం యూపీ ముఠాలే చేశారనే నిర్ణయానికి వచ్చారు. క్రైం పోలీసులు ఆ దిశగా దర్యాప్తు చేస్తున్నారు. పాత నేరస్తుల వేలిముద్రలు, కనుబొమ్మలు లాంటివి పరిశీలిస్తున్నారు. డీఎస్పీ ప్రసాద్ ఆధ్వర్యంలో పోలీసులను దర్యాప్తు కోసం నియమించారు.

అంబేడ్కర్ భవన్‌పై అనుచిత వ్యాఖ్యలు సరికాదు


అంబేడ్కర్ భవనం ఎదుట సంఘం ప్రతినిధులు

తిరుపతి అర్బన్, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ భవనంపై సంబంధంలేని నాగిశెట్టి ధర్మయ్య అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని చెల్లప్ప మేస్త్రి మెమోరియల్ అంబేడ్కర్ భవన్ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ పరమశివన్, కార్యదర్శి నాగేశ్వరరావు విమర్శించారు. స్థానిక బాలాజీకాలనీలోని అంబేడ్కర్ భవన్‌లో శనివారం వారిరువురు మీడియాతో మాట్లాడారు. భవనం అద్దెలో ప్రతి రూపాయి బ్యాంకుఖాతాలో జమ చేస్తున్నామన్నారు. ఖర్చుల వివరాలు నమోదుచేస్తున్నామని స్పష్టం చేశారు. పదవులు దక్కని కారణంగా కొంతమంది కమిటీతో విభేదించారన్నారు. తప్పుడు ఫిర్యాదులతో బ్యాంకు అధికారులను బయపెట్టి ఖాతాలను స్తంభింప చేశారన్నారు. హైకోర్టును ఆశ్రయించి బ్యాంకు లావాదేవీలను పునరుద్ధరించామని వివరించారు.

ఢిల్లీలో విజయంపై బీజేపీ శ్రేణుల సంబరాలు


మిఠాయిలు పంచుతున్న బీజేపీ నాయకులు, కార్యకర్తలు

తిరుపతి(ఉపాధ్యాయనగర్), ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): ఢిల్లీ ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించడంపై నగరంలోని ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు శనివారం సంబరాలు జరుపుకొన్నారు. రాఘవేంద్రనగర్‌లోని జిల్లా బీజేపీ కార్యాలయం ఎదుట పార్టీ జిల్లా అధ్యక్షులు సామంచి శ్రీనివాస్ ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. బాణసంచా కాలుస్తూ... మిఠాయిలు తినిపించుకున్నారు. నృత్యాలు చేశారు. పార్టీ నాయకుడు సామంచి శ్రీనివాస్ మాట్లాడుతూ... 27 సంవత్సరాల తరువాత ఢిల్లీ పీఠాన్ని బీజేపీ కైవసం చేసుకుందన్నారు... బీజేపీకి చారిత్రాత్మకమైన విజయాన్ని అందించినందుకు ఢిల్లీ ప్రజలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు భానుప్రకాష్‌రెడ్డి, డాక్టర్ శ్రీహరి, పొన్నగంటి భాస్కర్, వరప్రసాద్, పెనుబాల చంద్ర, జీవన్ రాయల్, గవ్వల అశోక్, రావూరి అశోక్, సుబ్బు యాదవ్, ప్రసాద్, కరుణాకర్‌రెడ్డి, దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

కపిలతీర్థం నీటి నిల్వకు చర్యలు తీసుకోవాలి


సమావేశంలో మాట్లాడుతున్న కమిటీ సభ్యులు

తిరుపతి(కపిలతీర్థం), ఫిబ్రవరి8(ఆంధ్రజ్యోతి): శేషాచలకొండల నుంచి కపిలతీర్థం ద్వారా వచ్చే వర్షపునీరు వృథా అవుతోందని కపిలతీర్థం నది పరిరక్షణ కమిటీ అధ్యక్షుడు హేమంత్‌కుమార్ కోరారు. శనివారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన కమిటీ సభ్యులతో కలిసి మాట్లాడుతూ నదినీటి ప్రవాహ కాలువ అడుగుభాగంలో సిమెంటు వేయడంతో చుక్కనీరు కూడా భూగర్భంలోకి ఇంకే పరిస్థితి లేదన్నారు. ఈ సిమెంటును తొలగించి ఇంకుడు గుంతలు తీయాలన్నారు. రానున్న రోజుల్లో తాగునీటి ఎద్దటికి తావివ్వకుండా చూడాలన్నారు. నదిలో నీరు ఇంకడం వల్ల సమీపంలోని జీవకోన, సత్యనారాయణపురం ప్రాంతాల్లో బోర్లలో నీరు రీచార్జ్ అయ్యి తాగునీటికి సమస్య ఉండదన్నారు. ప్రస్తుతం చిన్న వర్షం కురిసినా నీరు సిమెంటుపై నేరుగా చెరువులకు చేరుతున్నాయన్నారు. సోమశేఖర్, ఆనంద్, గంగాధర్, కొత్తపల్లి మునిరత్నం, లక్ష్మయ్య, గంగిరెడ్డి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగినులకు ప్రత్యేక వసతులు కల్పించాలి : ఎస్టీయూ


జాతీయ వర్క్‌షాప్‌లో పాల్గొన్న సంఘం జాతీయ నాయకులు

తిరుపతి(విద్య), ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): మహిళా ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు పాఠశాల, కళాశాల బాలికలకు ప్రత్యేక వసతులు కల్పించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని స్టేట్ టీచర్స్ యూనియన్ (ఎస్టీయూ)జాతీయ మహిళా నాయకులు కోరారు. ఎస్టీయూ మహిళా నాయకుల జాతీయ వర్క్‌షాప్ స్థానిక బైరాగిపట్టెడలోని ఎస్టీయూ భవన్‌లో శనివారం జరిగింది. వివిధ రాష్ట్రాల మహిళా నాయకులు, ఉమ్మడి చిత్తూరు జిల్లా మహిళా ప్రతినిధులు వర్క్‌షాప్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంఘం జాతీయ ఉపాధ్యక్షురాలు వీరమణి మాట్లాడుతూ... ఇంటర్ అనంతరం బాలికలు ఉన్నత విద్యకు వెళ్లడంలేదన్నారు. బాలికల ఉన్నత విద్య అభ్యాసించేలా ప్రభుత్వం ప్రత్యేక ప్రోత్సాహకాలు ప్రకటించాలని డిమాండ్ చేశారు. మహిళా ఉద్యోగులు ఉన్న కార్యాలయాలు, కళాశాలలు, యూనివర్సిటీలలో శిశు సంరక్షణ కేంద్రాలను, బేబీ ఫీడింగ్ సెంటర్లను ఏర్పాటు చేయాలని, పిల్లల వయసుతో సంబంధం లేకుండా శిశు సంరక్షణ సెలవులను సర్వీసులో ఎప్పుడైనా వినియోగించుకునేలా జీఓ జారీ చేయాలని కోరారు. కార్యక్రమంలో మహిళా నాయకులు రేణుకాదేవి, శ్రీదేవి, ద్రాక్షాయణి, జ్యోతి, రమాదేవి, రమ్య, అనిత, జయంతి, జయసుధ, సరిత, ప్రవీణ కుమారి, విశాల, పుష్పలత, ఏఎస్టీఎఫ్ వర్కింగ్ ప్రసిడెంట్ కత్తి నర్సింహారెడ్డి, ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సాయి శ్రీనివాస్, మల్లు రఘునాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న వెటర్నరీ విద్యార్థుల సమ్మె

●మంత్రి సవిత, ఎమ్మెల్యే ఆరణిలకు వినతిపత్రం


మంత్రి సవితకు వినతిపత్రమిస్తున్న విద్యార్థులు

తిరుపతిరూరల్, ఫిబ్రవరి8 (ఆంధ్రజ్యోతి): ఎస్వీవెటర్నరీ కళాశాల విద్యార్థులు చేపట్టిన సమ్మె శనివారమూ కొనసాగింది. విద్యార్థులు ఉదయం వర్సిటీ పరిపాలనాభవనం వద్దకు చేరుకుని అధ్యాపకుల పదోన్నతుల ఇంటర్వ్యూలను అడ్డుకునేందుకు ప్రయత్నించారు. పరిపాలనాభవనం ప్రధాన ద్వారాన్ని మూసేయడంతో కొంతసేపు బైటాయించారు. తిరుపతి పర్యటనకు వచ్చిన రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ మంత్రి సవితను వీరు పద్మావతి అతిధిగృహంలో కలిశారు. ఎంబీబీఎస్, బీడీఎస్, ఆయూష్ వైద్యవిద్యార్థుల మాదిరిగా తమకూ ఉపకారవేతనం ఇచ్చేలా కృషి చేయాలని వినతిపత్రం సమర్పించారు. రూ.7వేలు మాత్రమే స్టైఫండ్ ఇస్తున్నారని వాపోయారు. సీఎం చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెళ్లి తమకు న్యాయం జరిగేలా చూడాలని కోరారు. మంత్రి స్పందిస్తూ సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. జనసేన పార్టీకార్యాలయం వద్ద ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులుని కలిశారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్ విద్యార్థుల శిబిరాన్ని సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడారు.

వాహన చోదకులకు కౌన్సెలింగ్

తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): నిబంధనలను అతిక్రమిస్తున్న ద్విచక్ర వాహన చోదకులకు పోలీసులు శనివారం స్థానిక లీలామహల్ వద్ద కౌన్సెలింగ్ ఇచ్చారు. అదే సమయంలోదేవేంధర్ థియేటర్ రోడ్డులోకి వెళుతున్న భారీ వాహనాన్ని ఆపి అనుమతి లేదంటూ వెనక్కు పంపారు. వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. లేకుంటే అపరాధ రుసుము విధిస్తామని స్పష్టం చేశారు. భవిష్యత్తులో రాంగ్‌రూట్‌లు, లైసెన్సు లేకుండా వెళ్ళడం వంటి నిబంధనల అతిక్రమణకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తిరుపతి(ఆటోనగర్) ఫిబ్రవరి8(ఆంధ్రజ్యోతి): రేణిగుంట- తిరుపతి 33-11 కేవి సబ్‌స్టేషన్ల సబ్ డివిజన్‌ల పరిధిలో 33-11 కేవీ సబ్‌స్టేషన్లలో మరమ్మతుల కారణంగా ఆదివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని టౌన్ డివిజన్ ఈఈ .చంద్రశేఖరరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రేణిగుంట మండలంలోని తూకివాకం, గాజులమండ్యం, కరకంబాడి,గురవరాజుపల్లి, ఎలమండ్యం,కుర్రకాలువ సబ్‌స్టేషన్ల పరిధిలో విద్యుత్ అంతరాయమేర్పడుతుందన్నారు.

నేడు మెగా శాఖాహార ర్యాలీ


ర్యాలీ కరపత్రాల ఆవిష్కరణ

తిరుపతి(లీలామహల్), ఫిబ్రవరి8(ఆంధ్రజ్యోతి): స్థానిక మహతి ఆడిటోరియం వద్ద ఆదివారం ఉదయం మెగాశాఖాహార ర్యాలీ నిర్వహిస్తున్నట్లు స్పిరిట్యువల్ సొసైటీ అధ్యక్షుడు కంచిరఘురామ్ తెలిపారు. శనివారం ఆయన ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతూ మహతి వద్ద ఉదయం 7 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పలు కార్యక్రమాలు జరుగుతాయన్నారు. నగరవాసులతోపాటూ యోగ మీద ఆసక్తి ఉన్న అందరూ హాజరుకావాలని కోరారు. ఈ సందర్భంగా ఛలో తిరుపతి మెగాశాఖాహార ర్యాలీ కరపత్రాలు ఆవిష్కరించారు. కేశవరాజు, హరినాథ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

అధ్యాపకుడికి డాక్టరేట్

తిరుపతిరూరల్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూ ఇంజినీరింగ్ కళాశాల ఈసీఈ విభాగ పరిశోధక విద్యార్థి అనంత్ శంకర్‌కి వర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. ప్రొఫెసర్ ఎస్.వరదరాజన్ పర్యవేక్షణలో అనలిటికల్ అప్రోచస్ విత్ ఇన్‌క్రీజింగ్ డేటా హైడింగ్ కెపాసిటీ అండ్ సెక్యూర్డ్ ట్రాన్స్‌మిషన్ ఆఫ్ మెడికల్ ఇమేజస్ అనేఅంశంపై పరిశోధనా వ్యాసం సమర్పించినందుకు పీహెచ్‌డీ ప్రదానం చేశామని సీవోఈ దామ్లానాయక్ పేర్కొన్నారు.



అలిపిరి పాదాలమండపం కిటకిట

వరుస సెలవులకు తోడు రెండవ శనివారం అలిపిరి పాదాల మండపం భక్తులతో కిటకిటలాడింది. శనివారం పాదాల మండపం దర్శిస్తే శ్రీవారిని చూసినట్టేనని భక్తులు భావిస్తుంటారు. ఈ క్రమంలోనే సాయం సంధ్య వేళ ఆహ్లాదకర వాతావరణంలో భారీగా భక్తులు పాదాలమండపం వద్దకు చేరుకున్నారు. పండితలిగ, దీపారాధన సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం పక్కనే ఉన్న గోశాలను సందర్శించారు. ఇతర ప్రాంతాల వచ్చిన భక్తులు, స్థానికులు కలవడంతో కొబ్బరికాయల సమర్పణ ప్రాంతం కూడా కిక్కిరిసింది. దారిపొడవునా ఇరువైపులా ద్విచక్రవాహనాల పార్కింగ్ చాంతాడులా వ్యాపించింది. దీంతో గరుడ కూడలి వద్ద పలుమార్లు ట్రాఫిక్ స్తంభించింది. సెక్యూరిటీ సిబ్బంది అప్రమత్తమయ్యారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకొన్నారు. ఆ ప్రాంతమంతా గోవిందనామస్మరణలు మార్మోగింది.

- తిరుపతి అర్బన్, ఆంధ్రజ్యోతి





శ్రీహరి సర్వదర్శనానికి 18 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 18 గంటల సమయం పడుతోంది. శనివారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని కంపార్టుమెంట్లు నిండిపోయి క్యూలైన్ టీబీసీ వరకు వ్యాపించింది. ఇక వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

గురువారం నాటి హుండీ ఆదాయం: రూ.2.99 కోట్లు

శుక్రవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 62,971

తలనీలాలు సమర్పించిన వారు: 24,439





చుట్టూ వనం..

ఎంచక్కా భోజనం

● అడవి సెట్టింగుల మధ్య అనుభూతుల విందు







కంగారు పడకండి..ఇదేంటి అడవిలో భోజనం చేస్తున్నారేంటనుకుంటున్నారా.. మీరే కాదు ఎవరైనా అలా భావించాల్సిందే. ఇక్కడకు వస్తే అచ్చం అడవిని తలపించే వాతావరణమే. కాలానుగుణ అభిరుచుల్లో ఇదొకటి. కొందరికి సరదాగా అటవీ ప్రాంతంలో భోజనం చేయాలనే కోరిక ఉంటుంది. అలాగని అడవికి పోలేం కదా..అందుకే అలాంటి వాతావరణాన్ని కృత్రిమంగా సృష్టించి ఆహారప్రియులకు ఆకట్టుకుంటోంది కపిలతీర్థం సమీపంలోని పై వైస్‌రాయ్ హోటల్. పచ్చని చెట్ల పందిరి, పక్షులు, జంతువుల రూపాల సెట్టింగుల మధ్య తింటుంటే అదే ఫీలింగ్ కలుగుతుంది. ఇందులోని గుహా రెస్టారెంట్‌లో అడుగుపెట్టగానే గుహపై పెద్ద పులి నిద్రిస్తున్నట్లు కనపిస్తుంది. రాజుల కాలం మాదిరిగా ఇద్దరు భటుల విగ్రహాలు ఆరంభంలోనే ఆకర్షిస్తాయి. లోపలకు వెళతుంటే అడవిలో అడుగుపెడుతున్న అనుభూతి కలుగుతుంది. అటవీశాఖ యూనిఫారం తరహాలోనే సిబ్బంది దుస్తులు వేసుకుంటారు. ముత్యాల స్పెషల్ మటన్ బిరియాని, మటన్ ఫ్రై, మెంతాకు కోడి వేపుడు, టైగర్ చికెన్ ఇలా చికెన్‌లో వంద రకాలు, మటన్‌లో 50 రకాలు, ఫిష్‌లో 50, ప్రాన్స్‌లో 20 రకాల వంటకాలను ఆస్వాదించవచ్చు. శాకాహారుల కోసం గ్రౌండ్ ఫ్లోర్‌లో ప్రత్యేకంగా భోజనం ఉంటుంది. పిల్లల కోసం ఓ ఆటల గది కూడా ఏర్పాటు చేశారు.

- తిరుపతి(వైద్యం)



సవిత - విజయభారతి - శోభారాజ్

శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని శనివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు.వారిలో రాష్ట్ర మంత్రి సవిత, నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిషన్ సభ్యురాలు విజయభారతి, ప్రముఖ గాయని శోభారాజ్, పూతలపట్టు ఎమ్మెల్యే మురళీ మోహన్ ఉన్నారు. వీరికి ఆలయాధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి, లడ్డూప్రసాదాలు అందజేశారు.

పదవ తరగతి పరీక్షలకు కసరత్తు ప్రారంభం

తిరుపతి(విద్య), ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పదవ తరగతి పరీక్షల నిర్వహణకు కసరత్తు ప్రారంభమైంది. మార్చి 17 నుంచి జరగనున్న ఈ పరీక్షలపై జిల్లా విద్యాశాఖాధికారి కేవీఎన్ కుమార్ ఫోకస్‌పెట్టారు. 310 ప్రభుత్వ పాఠశాలల నుంచి 15,455 మంది, 266 ప్రైవేటు పాఠశాలల నుంచి 11,548 మంది పరీక్షలకు హాజరుకానున్నారు. వీరితోపాటు గతంలో ఫెయిలైన 634 మంది పరీక్షలు రాయనున్నారు. వీరందరి కోసం 164 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. విద్యాశాఖాధికారుల సూచనల మేరకు ఈ కేంద్రాల్లో పోలీసుశాఖ భద్రతా ఏర్పాట్లు చేపట్టనుంది. 1,870 మంది ఇన్విజిలేటర్లుగా వ్యవహరిస్తారు.రెవెన్యూ, పోలీసు, విద్యాశాఖకు చెందిన అధికారులతో 8 ఫ్లయింగ్ స్క్వాడ్లను, 20 సిట్టింగ్ స్క్వాడ్లను ఏర్పాటు చేస్తున్నారు. 164 మంది చీఫ్ సూపరింటిండెంట్లను, 164 మంది డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లను నియమించనున్నారు.అన్ని కేంద్రాల్లో బెంచీలను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు.



పకడ్బందీగా ఏర్పాట్లు

పరీక్షల నిర్వహణకు పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నాం. అన్ని కేంద్రాల్లో ప్రాథమిక వసతులు కల్పించనున్నాం. సిట్టింగ్, ఫ్లయింగ్ స్క్వాడ్లను ఏర్పాటు చేశాం. పరీక్ష కేంద్రాల్లో గాలి, వెలుతురు ఉండేలా చర్యలు తీసుకుంటున్నాం.

- కోట వెంకట నాగేంద్రకుమార్, డీఈవో

ముగ్గురు 'ఎర్ర'స్మగ్లర్ల అరెస్ట్

● రూ.25 లక్షల దుంగల స్వాధీనం

మంగళం, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : రేణిగుంట-కడప హైవేలోని కరకంబాడి సమీపంలోని నెలవాగు రిజర్వ్ ఫారెస్ట్ ప్రాంతంలో డంప్ చేసి ఉంచి 26 ఎర్రచందనం దొంగలను స్వాధీనం చేసుకుని, ముగ్గురు స్మగ్లర్లను అరెస్ట్ చేసినట్లు తిరుపతి రేంజ్ అటవీ క్షేత్రాధికారి బి.సుదర్శన్‌రెడ్డి తెలిపారు. రహస్య సమాచారం మేరకు శుక్రవారం రాత్రి సిబ్బందితో కలిసి కరకంబాడి వద్ద ఉన్న రైల్వే బ్రిడ్జి వద్ద నిఘా వేసినట్లు చెప్పారు. రాత్రి 10 గంటల ప్రాంతంలో రెండు ద్విచక్ర వాహనాల్లో వచ్చిన నలుగురు వ్యక్తులు ఎర్రచందనం దుంగలను బయటకు తీస్తుండగా అదుపులోకి తీసుకున్నామన్నారు. రఘు అనే వ్యక్తి పారిపోయాడని తెలిపారు. మోటార్ సైకిళ్లను, ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నామన్నారు. వాటి విలువ రూ.26 లక్షలు ఉంటుందని చెప్పారు. ఈ దాడుల్లో తిమ్మినాయుడుపాలెం సెక్షన్ ఎఫ్ఎస్‌వో రమేష్‌బాబు, ఎఫ్‌బీవోలు వెంకటేశ్వరరావు, కిషోర్‌కుమార్, సురేష్‌బాబు, ప్రొటెక్షన్ వాచర్లు పాల్గొన్నారు.



స్మగ్లర్ల అరెస్ట్ చూపుతున్న అటవీ శాఖ అధికారులు

సూర్యఘర్ యోజక పథకాన్ని వినియోగించుకోండి

తిరుపతి(ఆటోనగర్), ఫిబ్రవరి8 (ఆంధ్రజ్యోతి): సూర్యఘర్ పథకాన్ని గృహ విద్యుత్ వినియోగదారులు ఉపయోగించుకోవాలని తిరుపతి, చంద్రగిరి, పూతలపట్టు ఎమ్మెల్యేలు ఆరణి శ్రీనివాసులు, పులివర్తి నాని, మురళీమోహన్ కోరారు. తిరుపతి విద్యుత్ సర్కిల్ కార్యాలయ ప్రాంగణంలో శనివారం పీఎం సూర్యాఘర్ యోజక పథకం అవగాహన మేళాను వారు ప్రారంభించారు. ఏడు కంపెనీల వారు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పరిశీలించారు. వారు మాట్లాడుతూ విద్యుత్ వినియోగదారులు తమ ఇళ్లపై సోలార్ రూఫ్‌టాప్‌లు నిర్మించుకోవాలన్నారు. వేసవికాలంలో విద్యుత్ కొరతను తగ్గించడానికి ఇది దోహదపడుతుందని చెప్పారు. ఇలాంటి పథకాలను గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కువగా విస్తరింపజేయాలన్నారు. ఈ పథకం లబ్ధిదారులకు బ్యాంకుల నుంచి రుణాలు మంజూరు చేయడం శుభపరిణామమని పేర్కొన్నారు. సోలార్ రూఫ్‌టాప్ అవగాహన మేళా ఆది, సోమవారాల్లో నిర్వహిస్తామని ఎస్ఈ పి.సురేంద్రనాయుడు చెప్పారు. కార్యక్రమంలో సీజీఎంలు రమణాదేవి, వరకుమార్, ఏఎస్‌డీ మునిశంకరయ్య, ఈఈలు వి.చంద్రశేఖరరావు, పుల్లా బాలాజీ, వాసవీలత, సర్కిల్ ఎస్ఏవో శ్రీనివాసులు, డివైఈఈలు, ఏఈలు, ఏఏవోలు పాల్గొన్నారు.



సోలార్ ప్యానల్స్‌ను పరిశీలిస్తున్న తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

వ్యవసాయ బావిలో పడి కండక్టర్ మృతి

నారాయణవనం, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ బావిలో పడి కండక్టర్ మృతిచెందిన ఘటన మండలంలో శనివారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. ఏర్పేడు మండలం పాపానాయుడుపేటకు చెందిన తులసి(50) తిరుమల డిపోలో కండక్టర్‌గా పనిచేస్తున్నారు. రెండు రోజుల క్రితం సొంత పనుల నిమిత్తం తిరుపతికి వెళ్లి వచ్చాడు. బహిర్భూమి నిమిత్తం మండల కాంప్లెక్స్ సముదాయం వద్ద బస్సు దిగాడు. సమీపంలోని పొలాల్లోకి వెళ్లి కాలకృత్యాలు తీర్చుకుని బావిలోకి దిగే క్రమంలో అందులో పడిపోయాడు. ఈత రాకపోవడంతో చనిపోయాడు. ఎస్ఐ రాజశేఖర్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.



తులసి (ఫైల్ ఫొటో)

నత్తేనయం

● కొనసా..గుతున్న ఎస్వీ మ్యూజియం అభివృద్ధి పనులు

● ఐదేళ్లుగా భక్తులకు దూరమైన చరిత్ర సమూహం

తిరుమల, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): చరిత్రను కళ్లకు కట్టినట్లు చూపించే ప్రపంచం, జాతి సంస్కృతికి ఆనవాళ్లు, ఎన్ని తరాలవారికైనా కనిపించే చెక్కుచెదరని రూపాలు కొలువై ఉన్న ఎస్వీ మ్యూజియం భక్తులకు దూరమై ఐదేళ్లు గడుస్తోంది. అభివృద్ధి పేరుతో ఎస్వీ మ్యూజియాన్నే మర్చిపోయేలా చేశారు. పూర్వం మ్యూజియం శ్రీవారి ఆలయం ముందున్న వేయికాళ్ల మండపంలో అర్ష సంస్కృతి సదస్సు పక్కనే ఉండేది. అంతంతే క్రమంగా సందర్శకులు పెరుగుతున్న క్రమంలో 1996లో నారాయణగిరి పర్వతం అనుకుని సువిశాలంగా శ్రీవేంకటేశ్వర మ్యూజియం పేరుతో రూ.3.5కోట్లతో నిర్మించారు. మొత్తం 7గ్యాలరీలు, ఒక మినీ థియేటర్‌ను రూపొందించారు. 14, 15, 16 శతాబ్దాల నాటి రాతి, లోహ, స్ఫటిక, పాలరాతి విగ్రహాలు, పురాతన వాయిద్యాలు, రాజులు వాడిన కత్తులు, రక్షణ కవచం, యుద్ధంలో వినియోగించిన ఆయుధాలు, ముఖ్యంగా మైసూరు మహారాజు సమర్పించిన దంతపు పల్లకీ ఈ మ్యూజియం ద్వారా భక్తులకు దర్శనమిచ్చేవి. ఇక, బ్రహ్మోత్సవాలలో నిర్వహించే వాహనాలు, పుణ్యతీర్థాలు, నిజపాదాల రూపం, దశావతారాల ప్రతిమలు, శ్రీవారి ఆలయాన్ని అంచెలంచెలుగా నిర్మించిన సామంతరాజులు, శ్రీకృష్ణదేవరాయలు, తోడరమల్లు, అచ్యుతదేవరాయలు, అట్ల కుమార అనంతరాజులు, వెంకటపతి దేవరాయల ఫొటోలు కూడా ఉండేవి. ప్రత్యేకించి కపిలతీర్థం, తిరుచానూరు అమ్మవారి ఆలయంలో ఉపయోగించిన 18వ శతాబ్దానికి చెందిన గంటలు, కొయ్య పాదుకలు, స్వామివారి నిలువెత్తురూపం, ఇత్తడి పాదుకలు, రాగి పళ్లెం, దీప-ధూప స్తంభాలు, రాయలకాలం నాటి సంగీత వాయిద్యాలు, శ్రీనివాసమంగాపురం, గోవిందరాజుల స్వామి ఆలయ ప్రధాన ద్వారాలు, 17వ శతాబ్దం నాటి అలిపిరి వద్ద చెక్క మండపం, శ్రీకృష్ణలీలలు, శ్రీవారి రథంపై అలంకరించే తపోతదూళం, గరుడ, ద్వారపాలకుల విగ్రహాలు, వందల ఏళ్ల క్రితం నాటి నాణేలు, వస్తువులు, శాసనాలు, రాగిరేకులు ఇలా చరిత్రకు సంబంధించి అనేక వస్తువులను ఎస్వీ మ్యూజియం ద్వారా భక్తులు తిలకించేవారు.



తిరుమల ఎస్వీ మ్యూజియం

రూ.125 కోట్లతో ముందుకు వచ్చిన టాటా సంస్థ

తిరుమలలోని ఈ మ్యూజియాన్ని అంతర్జాతీయ స్థాయిలో తీర్చిదిద్దాలని టీటీడీ నిర్ణయించగా, అందుకు టాటా సంస్థ ముందుకు వచ్చింది. రూ.125 కోట్లతో అభివృద్ధి పనులు చేసేందుకు అంగీకారం తెలిపింది. అలాగే బెంగళూరుకు చెందిన మ్యాప్ సిస్టిమ్స్ సంస్థ కూడా 'టెంపుల్ ఎక్స్‌పీరియన్స్ గ్యాలరీ' ఏర్పాటుకు రూ.20 కోట్లు ఇచ్చేందుకు ముందుకు రావడంతో 2020 మార్చి నుంచి మ్యూజియానికి భక్తుల అనుమతిని టీటీడీ రద్దు చేసింది. ఆ పనులు నేటికీ నత్తనడకన కొనసాగుతున్నాయి. కొవిడ్ ఆంక్షలతో కొంతకాలం పనులు ఆగిపోతే, అధికారుల నిర్లక్ష్యంతో మరికొంతకాలం నత్తనడకన సాగినట్టు ఆరోపణలున్నాయి. గతేడాది బ్రహ్మోత్సవాల నాటికైనా ఆధునీకరణ పనులు పూర్తిచేసి అందుబాటులోకి తీసుకురావాలని ప్రయత్నించినా పనులు మాత్రం ముందుకు సాగలేదు. దీనికి కారణం సరైన మ్యూజియం అధికారులు లేకపోవడమనే విమర్శలు వినిపిస్తున్నాయి. అధికారుల నుంచి సరైన స్పందన లేకపోవడంతో టాటా సంస్థకు చెందిన ప్రతినిధులు కూడా అసంతృప్తి వ్యక్తం చేస్తున్నట్టు తెలిసింది.

మహా శివరాత్రి ఉత్సవాల కోసం రథాలకు మెరుగులు

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): మహా శివరాత్రి ఉత్సవాల కోసం జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామి ఊరేగనున్న రథాలకు అధికారులు మెరుగులు దిద్దే పనులు చేపట్టారు. ముక్కంటి ఆలయ భిక్షాల గాలిగోపురం సమీపంలో స్వామి అమ్మవార్ల రథాలు ఉన్నాయి. వీటికి రక్షణగా ఏర్పాటు చేసిన ఇనుప రేకులను తొలగించారు. రథాల పటిష్టతను పరిష్కరించడంతో పాటు అవసరమైన మెరుగులు అద్దే పనులను ప్రారంభించారు.



ఇసుక అక్రమంగా తరలిస్తున్న టిప్పర్, ఎక్స్‌కవేటర్ స్వాధీనం

● ఇద్దరు డ్రైవర్ల అరెస్టు

రేణిగుంట, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): స్వర్ణముఖి నది తీర ప్రాంతం నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న టిప్పర్, ఎక్స్‌కవేటర్‌ను గాజులమండ్యం పోలీసులు స్వాధీనం చేసుకుని, ఇద్దరు డ్రైవర్లను అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల కథనం మేరకు.. మండల పరిధిలోని తండ్లం గ్రామ సమీపంలో శనివారం రాత్రి పోలీసులు రోజువారీ తనిఖీలు చేపట్టారు. స్వర్ణముఖి నది తీర ప్రాంతంలో ఇసుకను అక్రమంగా తలిస్తుండటాన్ని గుర్తించి టిప్పర్‌ను, ఎక్స్‌కవేటర్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరు డ్రైవర్లను అదుపులోకి తీసుకుని పోలీసు స్టేషన్‌కు తరలించారు. అయితే మండల పరిధిలోని తండ్లం, సూరప్పకశం పంచాయతీ పరిధిలో స్వర్ణముఖి నదిలో తీసిన ఇసుకను రహస్య ప్రదేశాల్లో డంప్ చేసుకుని రాత్రి సమయంలో ప్రైవేటు లారీల్లో తమిళనాడు రాష్ట్రం ఊత్తుకోటకు తరలిస్తున్నట్లు సమాచారం. ప్రభుత్వ అనుమతులు ఉన్నాయని చెబుతూ తెల్ల టిప్పర్లతో బహిరంగంగా బిల్డర్లకు విక్రయిస్తునట్లు విశ్వసనీయ సమాచారం.



గాజులమండ్యం పోలీసుస్టేషన్‌కు తరలించిన టిప్పర్, ఎక్స్‌కవేటర్

త్వరలో మరిన్ని ఎలక్ట్రిక్ బస్సులు

● ఆర్టీసీ ఈడీ చెంగల్‌రెడ్డి

తిరుపతి(ఆర్టీసీ), ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): మంగళం డిపో పరిధిలోకి త్వరలో 50 ఎలక్ట్రిక్ బస్సులు రానున్నాయని ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తిమ్మాడి చెంగల్‌రెడ్డి తెలిపారు. అలిపిరి డ్రైవర్స్ క్వార్టర్స్ వద్ద అధునాతన సౌకర్యాలతో నిర్మిస్తున్న ఆర్టీసీ ఆస్పత్రిని శనివారం ఆయన సందర్శించారు. దాదాపు రూ. 6కోట్ల నిధులతో నిర్మిస్తున్న ఈ భవనం ప్రస్తుతం గ్రౌండ్, ఫస్ట్‌ఫ్లోర్ పూర్తకాగా, సెకండ్ ఫ్లోర్ నిర్మాణం పూర్తయ్యాక ప్రారంభ ఏర్పాట్లు చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఏప్రిల్‌లో ప్రారంభోత్సవం చేసేలా చూడాలన్నారు. అనంతరం అలిపిరి డిపోలో ఎలక్ట్రిక్ బస్సు ఛార్జింగ్ స్టేషన్‌ను, బస్సులను పరిశీలించారు. డీఎంతో సమీక్షిస్తూ ఇప్పటికే వంద ఎలక్ట్రిక్ బస్సులు జిల్లాలో నడుస్తున్నాయన్నారు. త్వరలోనే 50ఎలక్ట్రిక్ బస్సులు తిరుపతికి రానున్నాయన్నారు. ఇందుకు ఏర్పాట్లు పూర్తి చేయాలని డీపీటీవో నరసింహులను ఆదేశించారు. డిప్యూటీ సీటీఎం విశ్వనాథం, డీఈ చెన్నకేశవులు, డీఎంలు బాలాజీ, హరిబాబు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న ఈడీ చెంగల్‌రెడ్డి

బీసీ హాస్టల్స్‌లో వందశాతం ఫలితాలు రావాలి

● బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత

తిరుపతి(కలెక్టరేట్), ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షల్లో బీసీ వసతిగృహాల్లో వందశాతం ఫలితాలు రావాలని, ఆ మేరకు చర్యలు తీసుకోవాలని బీసీ సంక్షేమ శాఖ, చేనేత, జౌళి శాఖ మంత్రి సవిత సూచించారు. శనివారం తిరుపతిలోని పద్మావతి అతిథిగృహంలో బీసీ సంక్షేమ శాఖ అధికారులతో ఆమె సమీక్షించారు. బీసీ వసతి వసతిగృహాలను నిత్యం పర్యవేక్షించాలని, విద్యార్థులకు అవసరమైన స్టడీ మెటీరియల్ అందజేయాలని ఆదేశించారు. చదువులో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి ప్రత్యేక తరగతులు నిర్వహించాలన్నారు. బీసీ వసతి గృహాల అభివృద్ధికి ప్రభుత్వం అందజేసే నిధులతో పాటు సీఎస్ఆర్, ఎంపీ నిధులు సేకరించాలని ఆదేశించారు. మరో రెండు నెలల్లో ఆర్థిక సంవత్సరం ముగియనుందని, ఈ లోపు బీసీ కార్పొరేషన్ల ఆధ్వర్యంలో స్వయం ఉపాధి పథకాల లబ్ధిదారులను ఎంపిక చేసి యూనిట్లు గ్రౌండింగ్ అయ్యేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. అన్ని కులవృత్తుల వారికి సబ్సిడీతో కూడిన రుణాలు అందజేస్తున్నామన్నారు. జిల్లాలో చేనేత వస్త్రాల విక్రయాలకు తీసుకుంటున్న చర్యలపై చర్చించారు. నేతన్నలకు 365 రోజులు పనులు కల్పించేలా వీవర్ శాలలు, చేనేత క్లస్టర్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ సమావేశంలో నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్ రుద్రకోటి సదాశివం, బీసీ కార్పొరేషన్ ఈడీ శ్రీదేవి, జౌళి చేనేత శాఖ ఏడీ వరప్రసాద్, ఆప్కో జిల్లా మార్కెటింగ్ అధికారి కోటేశ్వరరావు, బీసీ జిల్లా సంక్షేమశాఖ అధికారి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న మంత్రి సవిత

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

పోలీస్ స్టేషన్లలో డీఎస్పీ తనిఖీలు



వాకాడు స్టేషన్‌లో సిబ్బందికి సూచనలిస్తున్న డీఎస్పీ గీతాకుమారి

వాకాడు, చిట్టమూరు, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): వాకాడు పోలీస్ స్టేషన్‌ను డీఎస్పీ గీతాకుమారి తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. సిబ్బంది పనితీరు, పాత కేసుల పురోగతి గురించి ఆరా తీశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ మహిళలు, బాలికలపై జరిగే నేరాలపట్ల అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. దొంగతనాలు, చట్టవ్యతిరేక కార్యక్రమాలను నివారించేందుకు పగలు, రాత్రి గస్తీ ముమ్మరం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో సీఐ హుస్సేన్‌బాషా, ఎస్‌ఐ నాగబాబు, సిబ్బంది పాల్గొన్నారు. అలాగే చిట్టమూరు పోలీస్ స్టేషన్‌ను డీఎస్పీ తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. మండలంలో సమస్యాత్మక గ్రామాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. పోలీస్ స్టేషన్ చుట్టు పక్కల ఉన్న పిచ్చి మొక్కలను తొలగించాలని సూచించారు.

క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలి



బ్యాటింగ్ చేసి క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న ఎస్‌ఐ సురేష్‌బాబు

చిల్లకూరు, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరూ క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని ఎస్‌ఐ సురేష్‌బాబు అన్నారు. శనివారం కలవకొండ క్రీడా మైదానంలో సీనియర్ క్రీడాకారుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్‌ను ఆయన బ్యాటింగ్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సురేష్‌బాబు మాట్లాడుతూ మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన పాత స్నేహితులంతా కలిసి క్రికెట్ పోటీలు నిర్వహించడంతో పాటు అసోసియేషన్ ఏర్పాటు చేసి సేవా కార్యక్రమాలు నిర్వహించడం స్ఫూర్తిదాయకమన్నారు. క్రీడల వల్ల మానసిక ఉల్లాసం, ఏకాగ్రత్త పెరగడంతో పాటు యువకుల మధ్య స్నేహం బలపడుతుందన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం శివసుబ్రహ్మణ్యం, నాగరాజు, మధు, రఘుబాబు, మోహన్, చిరంజీవి, త్రివిక్రమ్ భూపతి, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

నేడు ఆస్పత్రి అదనపు భవన నిర్మాణానికి శంకుస్థాపన

చిట్టమూరు, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): చిట్టమూరు ప్రభుత్వాస్పత్రి అదనపు భవనానికి గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ ఆదివారం శంకుస్థాపన చేయనున్నట్లు టీడీపీ మండల అధ్యక్షుడు గణపర్తి కిషోర్‌నాయుడు తెలిపారు. మండలంలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

వైభవంగా భీష్మ ఏకాదశి మహోత్సవాలు

నాయుడుపేట టౌన్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని స్వర్ణముఖి నది తీరాన వెలసిన ప్రసూనాంబ సమేత నీలకంఠేశ్వరస్వామి ఆలయంలో భీష్మ ఏకాదశి మహోత్సవాలు శనివారం వైభవంగా నిర్వహించారు. ఉదయం మండపారాధన, గణపతిపూజ, గణపతి హోమం, రుద్రాభిషేకాలు, సాయంత్రం సామూహిక లలిత సహస్రనామార్చన కుంకుమ పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ గూడూరు సుధీర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ ప్రభావతమ్మ, ఉగ్గుమూడి భాస్కర్‌రెడ్డి, బాలాజీస్వామి, అవధానం సుధీర్, అంకయ్య, తదితరులు పాల్గొన్నారు.

గూడలిలో...

కోట, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గూడలిలో గల శ్రీదేవి, భూదేవి సమేత జనార్ధనస్వామి ఆలయంలో శనివారం భీష్మ ఏకాదశి వేడుకలు జరిగాయి. ఆలయ ప్రధానార్చకుడు ఉదయగిరి ఆదిశేషాచార్యులు ఆధ్వర్యంలో స్వామి, అమ్మవార్లకు పలు అభిషేకాలు చేసి విశేషంగా అలంకరించారు. భక్తులు స్వర్ణముఖినదిలో స్నానాలుచేసి జనార్దనస్వామి ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు.

బీజేపీతోనే దేశాభివృద్ధి

గూడూరు, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్రమోదీ సారధ్యంలోని బీజేపీతోనే దేశాభివృద్ధి సాధ్యమవుతుందని ఆ పార్టీ పట్టణా ధ్యక్షుడు దయాకర్ అన్నారు. శనివారం ఢిల్లీ ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించడంతో స్థానిక టవర్‌క్లాక్ వద్ద నాయకులు సంబరాలు జరుపుకున్నారు. బాణసంచా పేల్చి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆరికట్ల బాలకృష్ణమనాయుడు, ప్రభాకర్, శ్రీనివాస్, శివ, మహేష్, బాలామని, నిరంజన్, పవన్‌కుమార్, మణికంఠ, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

12లోగా రుణాలకు దరఖాస్తు చేసుకోండి

ఓజిలి, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): బీసీ కార్పొరేషన్ రుణాల కోసం అర్హులైన వారు ఈనెల 12వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో విజయలక్ష్మి కోరారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మన్నెముత్తేరి సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతులు కారణంగా ఆదివారం ఉదయం 8నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏడీఈ శేఖర్ తెలిపారు. అదేవిధంగా పట్టణంలోని చెంగాళమ్మ ఆలయ వద్దనున్న సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు కారణంగా ఉదయం 11నుంచి మధ్నాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినయోగదారులు సహకరించాలని కోరారు.

దాడి ఘటనపై కేసు నమోదు

డక్కిలి, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): మండలంలో జరిగిన ఉపాధి పనుల్లో అక్రమాలపై విచారణ జరుగుతుండగా టీడీపీ కార్యకర్తలపై దాడిచేసిన వైసీపీకి చెందిన మాదిరెడ్డి రవి, మునికృష్ణా రెడ్డిపై శనివారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శివశంకర్ తెలిపారు. ఉపాధి పనులకు రాని కూలీల పేరున మస్టర్లు వేసి కొంతమది మేట్లు నిధులు స్వాహ చేస్తున్నారని డక్కిలి గ్రామానికి చెందిన ఓ వర్గం ఇటీవల జిల్లా కలెక్టరుకు ఫిర్యాదు చేసింది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శుక్రవారం ఏపీడీ వరప్రసాద్ విచారణ చేపట్టారు ఈ సమయంలో వైసీపీకి చెందిన మాదిరెడ్డి రవి, మునికృష్ణా రెడ్డి తనపై దాడి చేశారని టీడీపీ కార్యకర్త పెంచల నారాయణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు వైసీపీ కార్యకర్తలపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

కోడిపందేల స్థావరంపై పోలీసుల దాడి

దొరవారిసత్రం, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): దొరవారిసత్రం మండలం పులికాట్ తీరంలోని కారికాడు గ్రామ సమీపంలో పులికాట్ దిబ్బపై నిర్వహిస్తున్న కోడిపందేలా స్థావరంపై శుక్రవారం సాయంత్రం నాయుడుపేట రూరల్ సీఐ సంఘమేశ్వరరావు, దొరవారిసత్రం ఎస్‌ఐ అజయ్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు దాడులు జరిపారు. ఐదుగురిని అదుపులోకి తీసుకుని, ఒక కోడి పుంజు, రెండు మోటారు సైకిళ్లు, రూ.2400 నగదు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను సోమవారం కోర్టులో హాజరుపరచనున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.



కోగిలి వేముగుంటపాళెం మార్గంలో కోతకు గురైన రోడ్డు - మెట్టు సమీపంలో గోతులమయంగా మారిన దారి

గ్రామీణ రోడ్లకు మోక్షం ఎప్పుడో?

- మరమ్మతులకు నోచుకోని దారులు
- అష్టకష్టాలు పడుతున్న ప్రజలు

చిట్టమూరు, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): గత ఐదేళ్ల వైసీపీ పాలనలో రోడ్లు అభివృద్ధి నోచుకోకపోవడంతో ప్రజలు ప్రత్యక్ష నరకాన్ని చూశారు. ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్ శాఖ రోడ్ల దుస్థితి వర్ణానాతీతంగా ఉంది. అడుగుకో గుంతతో ఆదమరిస్తే ఆస్పత్రికే అన్న చందంగా వాహదారులకు, ప్రయాణికులకు ప్రాణ సంకటంలా మారింది. మండల పరిధిలోని తీర ప్రాంత గ్రామాలైన కోగిలి, ఎల్లూరు, వెలుగాజులపల్లి, బురదగాలి కొత్తపాళెం, బురదగాలి, కుమ్మరపాళెం వెళ్లే రోడ్డు అధ్వానంగా ఉంది. రోడ్డు పొడవునా గుంతలే దర్శనమిస్తున్నాయి. మెట్టు నుంచి గునపాడు, గునపాటిపాళెం మార్గ మధ్యలో ఆర్అండ్‌బీ రోడ్డు అస్తవ్యస్తంగా మారి ప్రయాణికులు, వాహన చోదకులు అవస్థలు పడుతున్నారు. కొత్తగుంట నుంచి వడ్డిపాళెం, ఆరూరు, అరవపాళెం, పెళ్లకూరు, తిమ్మారెడ్డివాగు గ్రామాలకు వెళ్లే రోడ్లు పెద్దపెద్ద గుంతలు ఏర్పడి వాహనాలు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. మండల కేంద్రమైన చిట్టమూరు కొత్తగుంట ప్రధాన రోడ్డుపై ప్రయాణం సర్కస్ ఫీట్లుగా మారింది. మల్లాం మార్గంలోని గెరండాల నుంచి రొయ్యల కాలువ మీదుగా మల్లాం వెళ్లే మార్గంలో



కృష్ణమనాయుడు కండ్రిగ సమీపంలో కల్వర్టు వద్ద పూడ్చని గండి

దెబ్బతిన్న రోడ్డు మార్జిన్‌ల వల్ల పలువురు వాహన చోదకుల మృత్యువాత పడగా, మరికొందరు గాయపడి ఆస్పత్రుల పాలయ్యారు. ప్రభుత్వం స్పందించి గ్రామీణ రోడ్లను బాగు చేయాలని ప్రజలు కోరుతున్నారు.



గూడూరు ఆర్టీసీ బస్టాండు - రైల్వేస్టేషన్ ఆవరణలోని ఆర్టీసీ తిరుమల బస్‌షెల్టర్ వద్ద ప్రైవేటు వాహనాలు

గూడూరు - తిరుమల బస్సులను పునరుద్ధరించండి

గూడూరు, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): గూడూరు నుంచి తిరుమలకు గత కొంత కాలంగా బస్సు సర్వీసులను నిలిపివేయడంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. కలియుగ దైవం వెంకన్నను దర్శించుకునేందుకు దేశం నలమూలల నుంచి భక్తులు వస్తుంటారు. ప్రధానంగా ఉత్తరాది రాష్ట్రాల నుంచి రైళ్లలో వచ్చే భక్తులు గూడూరు జంక్షన్‌లో దిగి ఇక్కడి నుంచి తిరుమలకు వెళుతుంటారు. అయితే గూడూరు నుంచి ఆర్టీసీ బస్సులు లేకపోవడంతో భక్తులు ప్రైవేటు వాహనాల్లో అధిక ధరలు చెల్లించి తిరుమలకు వెళ్లాల్సి వస్తోంది. గతంలో ఆర్టీసీ గూడూరు రైల్వేస్టేషన్ నుంచి తిరుమలకు 15 బస్సు సర్వీసులను నడిపేది. ఇందుకోసం రైల్వేస్టేషన్ ఆవరణలో ఆర్టీసీ డిపో ఆధ్వర్యంలో ప్రత్యేకంగా ప్రయాణికుల కోసం బస్‌షెల్టర్‌ను ఏర్పాటు చేశారు. ఇలా ఉండగా కొవిడ్ సమయంలో ఆర్టీసీ బస్సులను నిలిపివేశారు. కొవిడ్ ప్రభావం తగ్గిన తరువాత బస్సు సర్వీసులు తిరిగి పునరుద్ధరించలేదు. ప్రస్తుతం ఒక్క సర్వీసు మాత్రమే, అది కూడా తిరుపతి వరకు నడుపుతున్నారు. దీంతో ప్రైవేటు వాహనాలే భక్తులకు దిక్కుగా మారాయి. ఇదే అదునుగా వాహనదారులు భక్తుల నుంచి అధిక చార్జీలు వసూలు చేస్తున్నారు. రైల్వేస్టేషన్ ఆవరణలోని ఆర్టీసీ బస్‌షెల్టర్ ప్రైవేటు వాహనాలకు పార్కింగ్ స్థలంగా మారింది. శ్రీవారి భక్తుల ఇబ్బందులను గుర్తించిన ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ గూడూరు రైల్వేస్టేషన్ నుంచి తిరుమలకు బస్సు సర్వీసులను పునరుద్ధరించాలని రవాణాశాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డికి విజ్ఞప్తి చేయడం జరిగింది. ఆర్టీసీ ఉన్నతాధికారులు స్పందించి తిరుమలకు బస్సు సర్వీసులను పునరుద్ధరించేలా చర్యలు తీసుకోవాల్సి అవసరం ఉంది.

బెంగళూరు సర్వీసునూ పునరుద్ధరించాలి

గూడూరు నుంచి బెంగళూరుకు గతంలో నడుపుతున్న ఒక బస్సు సర్వీసును నిలిపివేశారు. దీంతో గూడూరు, సమీప ప్రాంతాలకు చెందిన ఎంతో మంది సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. పట్టణం నుంచి రెండు కిలోమీటర్ల దూరంలోని జాతీయ రహదారిపైకి చేరుకుని బైపాస్‌లో వెళ్లే వాహనాలను ఆశ్రయించాల్సిన పరిసితి నెలకొంది. ఒంగోలు, విజయవాడ, విశాఖపట్నం నుంచి వచ్చే ఆర్టీసీ, ప్రైవేటు బస్సుల్లో ఖాళీ ఉంటేనే ఆపుతారని, లేకుంటే ఇబ్బందులు తప్పడంలేదని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గూడూరు కోర్టు సెంటర్ నుంచి బెంగళూరుకు బస్సు సర్వీసు నడిపేలా ఆర్టీసీ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

విద్యార్థినితో వృద్ధుడి అసభ్య ప్రవర్తన

కోట, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): మండలంలో వృద్ధుడు 7వ తరగతి విద్యార్థినితో అసభ్యంగా ప్రవర్తించాడు. శనివారం మద్యం తాగి వున్న వృద్ధుడు వీధిలో ఒంటరిగా వెళుతున్న విద్యార్థినిని పుచ్చకాయ ఇస్తానని ఇంట్లోకి పిలిచి అసభ్యంగా ప్రవరించాడు. ఈ విషయాన్ని విద్యార్థిని తల్లిదండ్రులకు చెప్పడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

తాగునీటి సమస్య రానీయొద్దు

గూడూరు అర్బన్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని జనసేన ఉమ్మడి నెల్లూరు జిల్లా ఉపాధ్యక్షుడు తీగల చంద్రశేఖర్ అన్నారు. శనివారం జనసేన నాయకులు పట్టణంలో పలు ప్రాంతాల్లో దెబ్బతిని శిథిలావస్థకు చేరకుని ఉన్న ఓవర్‌హెడ్ ట్యాంకులను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలోని వాలాయనందపురం, మాళవ్యానగర్, అశోక్‌నగర్, విఘ్నేశ్వరపురం ప్రాంతాల్లోని నీళ్ల ట్యాంకులు దుస్థితికి చేరుకున్నాయని, వాటి స్థానంలో కొత్తవి నిర్మించాలన్నారు. మోహన్, సాయికిరణ్, సనత్, వంశీకృష్ణ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు

గూడూరు, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు చేపడుతామని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. శనివారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో కలిసి గ్రీవెన్స్‌డే నిర్వహించారు. నియోజకవర్గ ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు ప్రతి శనివారం గ్రీవెన్స్‌డే నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు.

సీఎం సహాయనిధి చెక్కు అందజేత

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): దొరవారిసత్రం మండలం పూలతోట గ్రామానికి చెందిన వేలూరు రూపేష్‌కు రూ.5 లక్షల సీఎం సహాయ నిధి చెక్కును ఎమ్మెల్యే అందజేశారు. రూపేష్ చాలా కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఇటీవల శస్త్రచికిత్స చేయించుకోవడంతో వైద్య ఖర్చుల కోసం సీఎం రిలీఫ్ పండ్‌కు ఎమ్మెల్యే సిఫార్సు చేశారు. ఇంతలో ఆరోగ్యం క్షీణించడంతో రూపేష్ మృతి చెందాడు. ఆయన కుమారుడు పవన్‌సాయికి సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి మంజూరైన రూ.5 లక్షల చెక్కును ఎమ్మెల్యే శనివారం అందజేశారు.

సముద్ర తాబేళ్ల సంరక్షణకు
సమన్వయంతో పనిచేయాలి
- పీసీసీఎఫ్ ఏకే నాయక్



సముద్ర తాబేళ్ల సంరక్షణకు సంబంధించిన బుక్‌లెట్‌ను ఆవిష్కరిస్తున్న పీసీసీఎఫ్ ఏకే నాయక్ పక్కనే డీఎఫ్‌వోలు

నెల్లూరు(వ్యవసాయం), ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): సముద్ర తాబేళ్ల సంరక్షణకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్(పీసీసీఎఫ్) ఏకే నాయక్ పేర్కొన్నారు. అటవీ శాఖ, ట్రీ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం నెల్లూరు రూరల్ మండలం గొలగమూడి రోడ్డులోని వీపీఆర్ కన్వెన్షన్‌లో సముద్ర తాబేళ్ల సంరక్షణపై అవగాహన సదస్సు జరిగింది. ముఖ్య అతిథిగా ఆయన పాల్గొని మాట్లాడుతూ సముద్ర జలాలను శుభ్రపరచడంలో తాబేళ్ల పాత్ర ఎంతో కీలమని చెప్పారు. వందల సంవత్సరాలు జీవించే తాబేళ్లు మానవుడి తప్పిదాల కారణంగా మృత్యువాత పడుతున్నాయన్నారు. ముఖ్యంగా మరబోట్ల కారణంగా చనిపోతున్నాయని తెలిపారు. అదేవిధంగా చేపలు కోసం వినియోగించే కొన్ని వలల కారణంగా కూడా అధికంగా మృత్యువాత పడుతున్నాయన్నారు. సముద్రంలో 8 నాటికల్ మైళ్ల అవతల మరబోట్లతో చేపలవేట సాగించాలని చట్టాలు చెబుతున్నా, వాటిని కొంతమంది మత్స్యకారులు పాటించడం లేదని చెప్పారు. వీటిపై ప్రభుత్వానికి నివేదించనున్నట్లు తెలియజేశారు. తాబేళ్ల గుడ్లను కూడా అటవీశాఖ ఆధ్వర్యంలో ఉన్న హేచరీలలో 48రోజుల పాటు సంరక్షించి ఆతరువాత పిల్లలను సముద్ర జలాల్లో వదులుతున్నామని వివరించారు. మత్స్యశాఖ, కోస్ట్‌గార్డు, మెరైన్ పోలీసులతోపాటు స్వచ్ఛంద సంస్థలు కూడా తాబేళ్ల సంరక్షణకు కృషి చేయాలని ఆయన తెలియజేశారు. తాబేళ్ల సంరక్షణకు అవసరమైన అంశాలపై సమావేశంలో చర్చించారు. ఈసమావేశంలో గుంటూరు, తిరుపతి అటవీశాఖ కన్జర్వేటర్లు రాజు, సెల్వంలతోపాటు నెల్లూరు, సూళ్లూరుపేట, ప్రకాశం, బాపట్ల డీఎఫ్‌వోలు మహబూబ్‌బాషా, హారిక, వినోద్, వేమయ్య, నెల్లూరు రేంజ్ ఆఫీసర్ మాల్యాద్రితోపాటు మత్స్యశాఖ, ఇండియన్ కోస్ట్‌గార్డ్, మెరైన్ పోలీసులు, మత్స్యకారులు, మత్స్యకార సంఘాల నాయకులు పాల్గొన్నారు.

అర్హులందరికీ పింఛన్లు ఇస్తాం

ఎమ్మెల్యే భానుప్రకాష్ ఆధ్వర్యంలో నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు వెల్లువెత్తిన అర్జీలు



నగరి టీడీపీ కార్యాలయంలో వినతి పత్రాలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే భానుప్రకాష్

నగరి, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ పింఛన్లు ఇస్తామని నగరి ఎమ్మెల్యే భానుప్రకాష్ హామీ ఇచ్చారు. నగరి టీడీపీ కార్యాలయంలో శనివారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు ఎమ్మెల్యే ఆధ్వర్యంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమాన్ని నిర్వహించారు. నియోజకవర్గం నుంచి భారీ ఎత్తున జనం తరలివచ్చి అర్జీలను సమర్పించారు. అత్యధికంగా పెన్షన్ల కోసమే వినతులు అందాయి. అలాగే నగరి మండలం ఓజీకుప్పం పంచాయతీలోని కేజీకుప్పంలో తన భూములకు దారి సమస్య ఉందని ఓ రైతు విన్నవించారు. గుండ్రాజుకుప్పం దళితవాడలో డ్రైనేజీ సౌకర్యం లేదని అలెక్స్ తెలిపారు. పలు గ్రామాల్లో శ్మశానాలకు దారి ఏర్పాటు చేయాలని కోరారు. భూసమస్యలు, ఇంటి పట్టాలు, నూతన గృహాలు కావాలంటూ ఇంకొందరు విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గ్రామాల్లో సీసీ రోడ్లు దాదాపు పూర్తయ్యాయని, కాలువల నిర్మాణం కూడా త్వరలో చేపట్టడం జరుగుతుందని చెప్పారు. సమస్యలను సంబంధిత అధికారులతో చర్చించి సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ప్రజలకు తెలియజేశారు. నగరి టీడీపీ పట్టణ అధ్యక్షుడు రమేష్‌బాబు, మండల అధ్యక్షుడు శివకుమార్‌రెడ్డి, కార్యదర్శి శ్రీనివాసన్, రాష్ట్ర టీఎన్‌టీయూసీ కార్యదర్శి బాలాజి, నాయకులు గుణశేఖర్, కృష్ణారెడ్డి,జ్యోతినాయుడు, నారాయణస్వామి నాయుడు, సురేష్‌నాయుడు,ఉమాపతి రాజు,అలెక్స్, అశోక్, చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలు మరువలేనివి

గూడూరు,ఫిబ్రవరి8(ఆంధ్రజ్యోతి):స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలు మరువలేనివని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. శనివారం స్థానిక డీఆర్‌డబ్ల్యు కళాశాలలో చరిత్రకారుడు నశీర్‌అహ్మద్ సహకారంతో ఫ్రీడమ్ ఫైటర్స్ ఎక్స్‌పో కమిటీ ఆధ్వర్యంలో స్వాతంత్ర్య సమరయోధుల చిత్ర పటాల ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన దేశానికి స్వాతంత్ర్యాన్ని సాధించేందుకు ఎంతోమంది మహనీయులు ప్రాణాలను సైతం త్యాగం చేశారన్నారు.

పుత్తూరు వార్తలు

బీజేపీ సంబరాలు



స్వీట్లు పంపిణీ చేస్తున్న బీజేపీ నేతలు

పుత్తూరు, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీ పీఠాన్ని బీజేపీ చేజిక్కించుకోవడంతో ఆ పార్టీ మహిళా మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యురాలు నిషిధరాజు ఆధ్వర్యంలో ఆనందోత్సవాలను జరుపుకున్నారు. ఫలితాలు వెలువడిన వెంటనే కార్వేటినగరం కూడలిలో శనివారం పెద్ద ఎత్తున బాణసంచా పేల్చి, మిఠాయిలను పంపిణీ చేశారు. నిషిధరాజు మాట్లాడుతూ ఎన్నికల ప్రచారానికి తాను వెళ్లిన ప్రతి గల్లీలో అభివృద్ధి జరుగలేదని ఓటర్లు తెలిపారని అన్నారు. కార్యక్రమంలో బీజేపీబ నాయకులు శ్రీధర్, లక్ష్మీవర్మ, శంకర్, మధు, మునస్వామి, జనసేన మహేష్ పాల్గొన్నారు.

రేపు వినాయకస్వామి ఆలయ మహా కుంభాభిషేకం

పుత్తూరు టౌన్, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): ఈ నెల 10వ తేదీన పట్టణంలోని కాపు వీధి(రెడ్డిగుంట వీధి)లో వెలసియున్న సుందర వినాయక స్వామి ఆలయ జీర్ణోద్ధరణ, అష్టబంధన మహా కుంభాభిషేకం జరుగుతుందని కమిటీ నిర్వాహకులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కుంభాభిషేక ఉత్సవాల్లో భాగంగా ఆలయంలో శనివారం ఉదయం విఘ్నేశ్వర పూజ, యాజమాన సంకల్పం, పుణ్యాహవచనం, గోపూజ, గణపతి, లక్ష్మీ, నవగ్రహ పూజ, హోమం, పూర్ణాహుతి కార్యక్రమాలను నిర్వహించారు. ఆదివారం విఘ్నేశ్వర పూజ, యాజమాన సంకల్పం, పుణ్యాహ వచనం జరుగుతుందని, 10వ తేది సోమవారం ఉదయం 8.45 గంటలకు మహా పూర్ణాహుతి, 9.30 గంటలకు గోపుర విమాన కుంభాభిషేకం, 10.30 గంటలకు పరివారం మరియు సుందర వినాయకస్వామి మహా కుంభాభిషేకం జరుగుతుందని తెలిపారు. సాయంత్రం 6 గంటలకు స్వామి అమ్మవార్ల ఉత్సవ మూర్తులు మూషిక వాహనంపై పురవీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనం భాగ్యం కల్పిస్తారని ఆలయ నిర్వాహకులు తెలిపారు.

పన్ను వసూలులో తీవ్ర జాప్యం

- పేరుకుపోయిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాల పన్నులు
- ఇదీ పుత్తూరు మున్సిపాలిటీలో పరిస్థితి

పుత్తూరు అర్బన్, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): పన్ను వసూళ్లలో పుత్తూరు మున్సిపాలిటీ అధికారులు అలసత్వం ప్రదర్శిస్తున్నారు. మొండి బకాయిలు పేరుకుపోయాయి. ఈ ఆర్థిక సంవత్సరం మార్చి 31వ తేదీతో ముగియనుంది. గడువు సమీపిస్తున్నా ఆస్తి, నీటి పన్ను వసూలు మందగొడిగా సాగుతోంది. ఉన్నతాధికారులు సమీక్షిస్తున్నా పన్నుల వసూళ్లలో అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం వీడటం లేదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాలకు సంబంధించిన బకాయిలు రూ.లక్షల్లో పేరుకుపోయాయి. ఖాళీ స్థలాల పన్ను వసూలులోనూ జాప్యం జరుగుతోంది. తాత్కాలిక ఆక్రమణలు, ప్రకటనల పన్నుల వసూళ్ల ఊసేలేదు. మున్సిపాలిటీకి వచ్చే పన్నులపైనే పట్టణంలో అభివృద్ధి పనులు ఆధారపడ్డాయి. మార్చి నెలాఖరుకల్లా కనీసం 80 శాతం పన్ను వసూలు చేస్తారా..! అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పుత్తూరు మున్సిపాటీ పరిధిలో 13,850 అసెస్‌మెంట్లు ఉండగా, ఏడాదికి ఆస్తి పన్ను రూ.3.68 కోట్లు, నీటి పన్ను రూ.2.26 కోట్లు వసూలు చేయాల్సి ఉంది. పాత బకాయిలు రూ.1.96 కోట్లతో కలిపి రూ.5.64 కోట్ల పన్నులు వసూలు కావాల్సి ఉండగా, 2024-25 ఏడాదికి గాను రూ.2,76,85,000 వసూలైనట్లు తెలిపారు. పన్ను వసూళ్లపై మున్సిపాలిటీలో ఉన్నతాధికారుల పర్యవేక్షణ పూర్తిగా కొరవడింది. దీంతో సిబ్బంది కార్యాలయానికి పరిమితమవుతూ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు.

రైల్వే అధికారులకు లేఖ

పుత్తూరు మున్సిపాలిటీ పరిధిలో రైల్వే క్వార్టర్స్ ఉన్నాయి. ఈ ఇళ్లకు మున్సిపాలిటీ పన్నులు చెల్లించాలని డిమాండ్‌ను రైల్వే అధికారులకు పంపారు. ఈ పన్నులు చెల్లించే విధానం మాకు వర్తించదని వారు తెగేసి చెప్పారు. కాగా, మున్సిపల్ అధికారులు చెన్నై డివిజన్ రైల్వే ఉన్నతాధికారులకు లేఖ ద్వారా సమాచారం ఇచ్చారు. అక్కడ నుంచి కూడా ఎటువంటి స్పందన లేకపోవడంతో కోర్టును ఆశ్రయించే ఆలోచనలో మున్సిపల్ అధికారులు ఉన్నారు. రైల్వే వారు చెల్లించాల్సిన పన్ను రూ.17.39 లక్షలు బకాయిగా ఉంది. రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాల నుంచి రూ.49.24 లక్షలు వసూలు కావాల్సి ఉంది. ఆర్టీసీ, మండల రెవెన్యూ కార్యాలయం, ఏపీఎస్పీడీఎల్, ఎంపీడీవో కార్యాలయం, కాంప్లెక్స్, మార్కెట్ యార్డ్, సదాశివేశ్వరస్వామి ఆలయం, పోలీస్ స్టేషన్, ఆర్అండ్‌బీ గెస్టహౌస్ తదితర



పుత్తూరు మున్సిపల్ కార్యాలయం

ప్రభుత్వ కార్యాలయాలు పన్నులు చెల్లించాల్సి ఉన్నాయి. అన్ని విభాగాలకు నోటీసులు జారీ చేసినట్లు మున్సిపల్ అధికారులు తెలిపారు. కాగా, గతేడాది మార్చి 31వ తేదీన పుత్తూరు మున్సిపాలిటీ విద్యుత్ బకాయిలు చెల్లించకపోవడంతో విద్యుత్ కనెక్షన్‌ను తొలగించారు. మున్సిపల్ అధికారులు మొండి బకాయిల విషయంలో చర్యలు చేపట్టకపోవడం కూడా పన్నుల వసూళ్లలో జాప్యానికి కారణంగా పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

ప్రణాళిక విభాగం నిర్లక్ష్యం

తాత్కాలిక ఆక్రమణలు, ప్రకటనల పన్ను విషయంలో పుత్తూరు మున్సిపాలిటీ ఏటా రూ.లక్షల్లో ఆదాయాన్ని కోల్పోతోంది. ఇందుకు ప్రణాళిక విభాగం నిర్లక్ష్యం కారణంగా తెలుస్తోంది. ఒక వేళ అరకొరగా తాత్కాలిక ఆక్రమణలు, ప్రకటనలకు సంబంధించిన పన్నులు వసూలు చేసినా పక్కదారి పడుతున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. రాజకీయ జోక్యం కారణంగా రాబట్టలేకపోతున్నామని ప్రణాళిక విభాగం అధికారి చెబుతుండటం గమనార్హం. పుత్తూరు పట్టణంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించుకునేందుకు పూర్తిస్థాయిలో పన్నులు వసూలు కావాల్సిందే. అంతే కాకుండా తాత్కాలిక ఆక్రమణలు, ప్రకటనల పన్నులు కూడా తప్పక వసూలు చేయాల్సి ఉంది. అప్పుడే పట్టణ ప్రజలకు మెరుగైన సేవలు అందించగలరు.

శ్రీకాళహస్తి
సత్యవేడు



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

సమస్యల పరిష్కారం కోసమే
ప్రజా దర్బార్
● ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): ఎప్పటికపుడు సమస్యలను పరిష్కరించడమే ధ్యేయంగా ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నామని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని ఎన్టీఆర్ భవన్‌లో శనివారం ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఫిర్యాదుల వేదికను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ గత అరాచకమైన వైసీపీ పాలనతో క్షేత్రస్థాయిలో ప్రజా సమస్యలు అపరిష్కృతంగా మారాయన్నారు. వైసీపీ భూబకాసురుల అనాలోచిత చర్యలతో రెవెన్యూ సమస్యలు ప్రజలను వెంటాడుతున్నాయన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం పురపాలక సంఘంతో పాటు ప్రతి మండలానికి ఒక టోల్‌ఫ్రీ నెంబరును ప్రజలకు చేరువ చేశామని చెప్పారు. వస్తున్న ఫిర్యాదులను తానే ఎప్పటికపుడు పరిశీలించి పరిష్కారం చేస్తున్నామన్నారు. అయినా మళ్లీ పరిష్కారం కాని సమస్యలను అధ్యయనం చేసేందుకు గాను నియోజకవర్గ కేంద్రంలో వినతుల స్వీకారం కోసం వేదికను ఏర్పాటు చేశామన్నారు. అనంతరం నియోజకవర్గ నలుమూలల నుంచి సుమారు 150 ఫిర్యాదులను ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఉదయం 9నుంచి మధ్యాహ్నం 1గంట వరకు ఎమ్మెల్యే స్వయంగా ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తూ వివరాలను అడిగి తెలుసుకున్నారు. సమస్యలను పరిష్కరించాల్సిందిగా అక్కడికక్కడే సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పట్టణాధ్యక్షుడు విజయకుమార్, నాయకులు చెంచయ్య నాయుడు, కంఠా రమేష్, పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.

వీకేఆర్‌పై కాలనీలో అక్రమ కట్టడాలు
● చోద్యం చూస్తున్న రెవెన్యూ అధికారులు



వీకేఆర్‌పై కాలనీలో అక్రమ నిర్మాణాలు

వరదయ్యపాళెం, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): వరదయ్యపాళెం మండలం చిన్నపాండూరు పంచాయతీ వీకేఆర్‌పై కాలనీలో అక్రమ నిర్మాణాలు కొనసాగుతూనే ఉన్నాయి. అధికారులు మాత్రం చోద్యం చూస్తున్నారు. ఇటీవల వీకేఆర్‌పై గిరిజనకాలనీ ప్రాథమిక పాఠశాల సమీపంలో ఓ వ్యక్తి ఇంటి నిర్మాణం కోసం పనులు ప్రారంభించాడు. తహసీల్దారుకు ఫిర్యాదులు అందడంతో పనులు ఆపించారు. తాజాగా వీకేఆర్‌పై కాలనీ కూడలి నుంచి హీరో పరిశ్రమకు వెళ్లే మార్గంలో అక్రమంగా ఇంటి స్థలాన్ని కొనుగోలు చేసి నిర్మాణాలు చేపడుతున్నారు. ఇంత జరుగుతున్నా నియంత్రించాల్సిన రెవెన్యూ అధికారులు మాత్రం తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. మండలంలో స్థలాలు అధిక ధరలు పలుకుతున్నాయి. సెంటు రూ.2లక్షల నుంచి రూ.5లక్షల వరకు ఉంది. దీంతో ప్రభుత్వ భూమి, ఆర్‌అండ్‌బీ రోడ్లను ఆక్రమించుకుని కొంతమంది అమ్ముకుంటున్నారు. పత్రికల్లో కథనాలు వచ్చిన సమయంలో మాత్రం కొద్దిరోజులు ఆగి తిరిగి మళ్లీ యథావిధిగా అక్రమ కట్టడాలు చేస్తున్నారు. గత ప్రభుత్వంలో గిరిజనులను భయపెట్టి ఆస్తులను సైతం ఆక్రమించి తమిళనాడు వాసులకు అమ్ముకున్న ఘటనలు ఉన్నాయి. సమీప ప్రాంతాల్లో పరిశ్రమలు ఉండటంతోనే ఇలా ఆక్రమణలు జరుగుతున్నాయని.. జిల్లా అధికారులైనా స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

బీఎన్‌కండ్రిగలో దట్టమైన పొగమంచు
● రెండు గంటలపాటు ఇబ్బందులు పడ్డ ప్రజలు



లైట్లు వేసుకుని ప్రయాణిస్తున్న వాహనదారులు

బుచ్చినాయుడుకండ్రిగ, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): మండలంలో పొగమంచుతో ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. శనివారం తెల్లవారుజాము నుంచి పొగమంచు పూర్తి స్థాయిలో కమ్ముకుంది. దీంతో వాహనదారులు లైట్లు వేసుకుని ప్రయాణించాల్సి వచ్చింది. పొగమంచుతో ప్రజలు ఉదయం 5గంటల నుంచి 7 గంటల వరకు ఇబ్బందులు పడ్డారు.

కల్కి ఆక్రమిత భూములను
అటవీశాఖ స్వాధీనం చేసుకోవాలి



మాట్లాడుతున్న నార్నె వెంకటసుబ్బయ్య

వరదయ్యపాళెం, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): బీఎన్‌కండ్రిగ మండలంలో కల్కి ఆక్రమించుకున్న భూములను అటవీశాఖ స్వాధీనం చేసుకోవాలని భారత హేతువాద సంఘం అధ్యక్షుడు నార్నె వెంకటసుబ్బయ్య, బత్తలవల్లం గ్రామానికి చెందిన చంద్రయ్య, రాజయ్య, వెంకటయ్య అన్నారు. శనివారం విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో వారు మీడియాతో మాట్లాడుతూ తిరుపతి జిల్లా బీఎన్‌కండ్రిగ మండలంలో సర్వే నెంబరు 295లో అంజూరు అటవీ పరిధిలో 21 ఎకరాల భూమిని కల్కి ట్రస్టు నిబంధనలకు విరుద్ధంగా ఆక్రమించిందన్నారు. పెద్దపెద్ద భవనాలు నిర్మించి చుట్టూ ఫెన్సింగ్ వేసి లోపల యజ్ఞాలు, యాగాలు, భజనలు చేస్తూ విదేశీయులను రప్పించి రాత్రిపూట ఏం చేస్తున్నారో తెలియని పరిస్థితి నెలకొందన్నారు. అక్కడ వస్తున్న శబ్దాలు భరించలేక అటవీప్రాంతం నుంచి జంతువులు గ్రామాల్లోకి రావడంతో చనిపోతున్నాయన్నారు. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి అటవీ భూములను స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు.

వెంకటయ్యకు న్యాయం చేయాలి
- లేని పక్షంలో 17న మఠం ముట్టడి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రజాసంఘాల నాయకులు

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): కేవీబీపురం మండలం మఠం పంచాయతీ మాజీ దళిత సర్పంచ్ కలపాటి వెంకటయ్యకు న్యాయం చేయకుంటే ఈ నెల 17న మఠం గ్రామాన్ని ముట్టడిస్తామని దళిత సంఘాల నాయకులు హెచ్చరించారు. పట్టణంలోని పుచ్చలపల్లి సుందరయ్యభవన్‌లో శనివారం దళిత సంఘాల రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈసందర్భంగా దళిత హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షులు చిన్నం కాళయ్య మాట్లాడుతూ మఠం ఘటన అంటరానితనానికి, కులవివక్షకు నిలువెత్తు నిదర్శనమన్నారు. వెంకటయ్యకు ప్రభుత్వం భూమిపై సర్వహక్కులు కల్పించినా అగ్రవర్ణాల కుటుంబం దాడి చేయడం వెనుక రెవెన్యూ, పోలీసుశాఖల వైఫల్యం ఉందన్నారు. వెంకటయ్యపై దాడి జరిగి నాలుగు రోజులు గడుస్తున్నా వారిపై ఎందుకు అట్రాసిటీ కేసు నమోదు కాలేదని ప్రశ్నించారు. వెంకటయ్యపై దాడి చేసిన వారిపై అట్రాసిటీ కేసు నమోదు చేసి వారం లోపు భూమి అప్పగించకపోతే 17వ తేదీన మఠం గ్రామాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. అంగేరి పుల్లయ్య, దాసరి జనార్ధన్, పులి శ్రీకాంత్, చందమామల కోటయ్య, కూలి రవి, గంధం మణి, గురవయ్య, బాధితులు వెంకటయ్య, పెంచులమ్మ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ ఫారెస్టు వాచర్ మృతి



మునీంద్ర(పాతచిత్రం)

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): ఎన్‌ఆర్‌ఐ కారు ఢీకొన్న ఘటనలో తీవ్రంగా గాయపడి వారం రోజుల నుంచి చికిత్స పొందుతున్న దొడ్ల మునీంద్ర (49) మృతి చెందాడు. శ్రీకాళహస్తి పట్టణం కేఎంపల్లి దళితవాడకు చెందిన మునీంద్ర ఫారెస్టు వాచర్‌గా పనిచేస్తుండేవాడు. ఈ నెల 1వ తేదీ రాత్రి తొట్టంబేడు మండలం బసవయ్యపాళెం సమీపంలోని పూతలపట్టు-నాయుడుపేట జాతీయ రహదారిపై ఒప్పంద ఫారెస్టు వాచర్‌గా విధులకు హాజరయ్యాడు. విజయవాడకు చెందిన ఓ ఆస్ట్రేలియా ఎన్‌ఆర్‌ఐ నెల్లూరు నుంచి కారులో బెంగళూరుకు బయలుదేరాడు. బసవయ్యపాళెం సమీపంలో ఆ ఎన్‌ఆర్‌ఐ కారు మునీంద్రను ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానిక ఏరియా ఆస్పత్రిలో ప్రథమ చికిత్స అనంతరం మునీంద్రను మెరుగైన వైద్యం కోసం కరకంబాడి వద్ద ఉన్న ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. శనివారం సాయంత్రంచికిత్స పొందుతూ మునీంద్ర అక్కడే మృతి చెందాడు. శ్రీకాళహస్తి రెండవ పట్టణ పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. రోడ్డున పడ్డ తమ కుటుంబానికి న్యాయంచేయాలని వారు గుండెలు బాదుకుంటూ విలపించారు.

నామినేటెడ్ పదవుల్లో పొత్తు పాటించండి: బీజేపీ

సత్యవేడు, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): నామినేటెడ్ పదవుల నియామకంలో టీడీపీ పొత్తుధర్మం పాటించాలని జిల్లా బీజేపీ మాజీ ఉపాధ్యక్షుడు, సీనియర్ నేత బండారు మోహన్‌బాబు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 40 సంవత్సరాలుగా మండల రాజకీయాల్లో, బీజేపీలో కొనసాగుతున్న తనకు కమిటీలో ప్రాధాన్యత ఇవ్వకుండా ఆస్పత్రిపై అవగాహన లేని వారిని కమిటీ సభ్యులుగా నియమించారని ఆవేదన వ్యక్తం చేశారు. కమిటీలో తనకు చోటు కల్పించాలని ఇటు ఎమ్మెల్యేను, అటు టీడీపీ నాయకులను మూడు నెలలుగా కోరుతున్నా పట్టించుకోలేదని వాపోయారు.

భక్తకన్నప్పకు విశేష పూజలు

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో శనివారం భక్తకన్నప్పకు విశేష పూజలు నిర్వహించారు. భక్తకన్నప్ప ముక్తి చెందిన తిథి కావడంతో స్వామివారికి పలు రకాల అభిషేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారి విశేషంగా అలంకరించి ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ మృతి కేసులో ఒకరి అరెస్ట్

సత్యవేడు, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): సత్యవేడు మండలం ఓబులరాజు కండ్రిగలో ఇటీవల మృతి చెందిన ఆటో డ్రైవర్ లక్ష్మయ్య మృతి కేసులో ఒకరిని అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ రామస్వామి తెలిపారు. ఈ నెల 3వ తేదీన ఆటో బాడుగ విషయంలో చెలరేగిన వివాదంలో గ్రామంలోని అరుదంతివాడకు చెందిన ఆటో డ్రైవర్ లక్ష్మయ్యపై గ్రామానికి చెందిన జగదీష్ రాజు, భాస్కర్ రాజు కలిసి భౌతిక దాడికి పాల్పడ్డారు. ఈ దాడిలో గాయపడ్డ లక్ష్మయ్య ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. లక్ష్మయ్య కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ రామస్వామి కేసు నమోదు చేసి, విచారణ చేపట్టారు. శనివారం జగదీష్ రాజును అరెస్ట్ చేసి పుత్తూరు డీఎస్పీ రవికుమార్ ఆధ్వర్యంలో రిమాండ్‌కు తరలించారు. మరో నిందితుడు భాస్కర్ రాజు పరారీలో ఉన్నట్లు ఎస్‌ఐ తెలిపారు. అతడిని కూడా త్వరలో పట్టుకుంటామని తెలిపారు

రైతు గుర్తింపు కార్డు తప్పనిసరి

పిచ్చాటూరు, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): ప్రతి రైతుకు రైతు గుర్తింపు కార్డు తప్పని సరి అని వ్యవసాయ అధికారి సంజీవరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు ఆర్‌ఎస్‌కే సెంటర్‌కు వెళ్లి వ్యవసాయ సహాయకులను సంప్రదిస్తే అక్కడ మీ వివరాలు ఆధార్‌కార్డు, పట్టా దారు పాసు బుక్కు, ఫోన్ నెంబర్‌తో గుర్తింపు కార్డు లభిస్తుందన్నారు. ఈ కార్డు ఉంటే పంటల బీమా, పీఎం కిసాన్ యోజన, నష్ట పరిహారం, అన్నదాత సుఖీభవ, వ్యవసాయ యంత్ర పరికరాలపై రాయితీలు పొందవచ్చన్నారు. నేరుగా సంప్రదించలేని పక్షంలో ఫోన్ ద్వారా సంబంధిత అధికారికి వివరాలు చెప్పి మీకు వచ్చే ఓటీపీ నెంబరు తెలిపి కార్డు పొందవచ్చన్నారు. ప్రభుత్వం అందించే పథకాలతో పాటు, వ్యవసాయ శాస్త్రవేత్తలు అందించే సలహాలు లభిస్తాయని పేర్కొన్నారు.

ప్రజా సహకారంతోనే
నేరాల నియంత్రణ: డీఎస్పీ

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): ప్రజా సహకారంతోనే మరింతగా నేరాల నియంత్రణ సాధ్యమని శ్రీకాళహస్తి డీఎస్పీ నరసింహమూర్తి అన్నారు. శ్రీకాళహస్తి వన్ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో శాంతిభద్రతలపై శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీకాళహస్తిలో శాంతిభద్రతలను మరింత పటిష్ఠం చేసేందుకు పోలీసు అధికారులు కట్టుదిట్టంగా వ్యవహరించబోతున్నారని తెలిపారు. రాత్రి 11గంటల తరువాత రోడ్లపై సంచరించడం మానుకోవాలని చెప్పారు. అత్యవసరమైతే తప్ప రాత్రివేళల్లో జనాలు గుమికూడటం తగదన్నారు. ఆకతాయిలు, అసాంఘికశక్తులను అరికట్టేందుకు రాత్రివేళల్లో విస్తృతంగా రోడ్లపై తిరిగేవారిని తనిఖీలు చేస్తున్నామన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యపానం సేవిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకుని ప్రజలు చోరీలను నియంత్రించేందుకు అవగాహనతో అప్రమత్తంగా మెలగాలని కోరారు. బయట ప్రాంతాలకు వెళ్లేవారు ముందుగా పోలీసులకు సమాచారం ఇస్తే ఎల్‌హెచ్‌ఎంఎస్ విధానం ద్వారా ప్రత్యేక సీసీకెమెరాలతో నిఘా ఏర్పాటు చేస్తామన్నారు. పట్టణంలోని వ్యాపార సంస్థలు, విద్యాసంస్థలు, ఆస్పత్రులు వంటి నిర్వాహకులు సీసీకెమెరాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. సీఐలు గోపి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఎన్‌ఎఫ్‌పీఈ 38వ రాష్ట్ర
ద్వైవార్షిక మహాసభలు ప్రారంభం

రేణిగుంట, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): నేషనల్ ఫెడరేషన్ పోస్టల్ ఎంప్లాయిస్, ఆల్ ఇండియా ఆర్‌ఎంఎస్, ఎంఎంఎస్, ఎంటీసీ 38వ రాష్ట్ర స్థాయి ద్వైవార్షిక మహాసభలు శనివారం స్థానిక ప్రైవేటు కల్యాణ మండపంలో ప్రారంభమయ్యాయి. రిసెప్షన్ కమిటీ చైర్మన్ అమర్నాథరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన మహాసభలకు ముఖ్య అతిథులుగా ఆల్ ఇండియా మాజీ, ప్రస్తుత జనరల్ సెక్రటరీలు సురేష్, ముక్తార్, సర్కిల్ సెక్రటరీ రామాంజనేయులు, ఏజీఎస్ కన్నయ్య, ఎస్‌ఏడీలు సుధీర్‌బాబు, రాజేంద్ర హాజరయ్యారు. రెండేళ్లకొకసారి జరిగే రాష్ట్రస్థాయి ద్వైవార్షిక మహాసభల్లో యూనియన్ సమస్యలు, భవిష్యత్తులో తీసుకోవాల్సిన ప్రణాళికలపై చర్చించి ఆదివారం మహాసభలో నూతన రాష్ట్ర కార్యవర్గాన్ని ప్రకటించనున్నారు. వివిధ జిల్లాల నుంచి విచ్చేసిన యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

వేడుకగా భీష్మ ఏకాదశి వేడుకలు

నారాయణవనం, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): నారాయణవనంలోని వెలసిన పద్మావతీ సమేత కళ్యాణ వెంకటేశ్వరుడి ఆలయంలో భీష్మ ఏకాదశి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఉభయ నాంచారులతో కళ్యాణ వెంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం స్వామి, అమ్మవార్లను సుప్రభాత సేవతో మేల్కొలిపి, నిత్యపూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఉభయ నాంచారులతో స్వామివారిని మాడవీధుల్లో ఊరేగించారు. భక్తులు భీష్మ ఏకాదశి కావడంతో ఉపవాస దీక్షతో స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ అధికారి నాగరాజు, అర్చకులు శ్రీధర్ భట్టాచార్యులు, శ్రీనివాస భట్టాచార్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

బాల్యవివాహాలను అరికడదాం

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలను అరికట్టడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని శ్రీకాళహస్తి డీఎస్పీ నరసింహమూర్తి అన్నారు. శనివారం డీఎస్పీ కార్యాలయం వద్ద బాల్య వివాహాల వ్యతిరేక పోరాట సమితి ఆధ్వర్యంలో గోడపత్రికలను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ బాల్య వివాహాల వలన కలిగే అనర్థాలను వివరించారు. ఈ కార్యక్రమంలో చందమామల కోటయ్య, జనమాల గురవయ్య, శ్రీకాంత్, వేణు, చారుశీల తదితరులు పాల్గొన్నారు.

కారు ఫైనాన్స్ క్లియర్ చేయమన్నందుకు...
ఇద్దరిపై దాడి



గాయపడిన కాలేషా, చాన్‌బాషా

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): తాము పూర్తి నగదు చెల్లించి కొనుగోలు చేసిన కారు ఫైనాన్స్‌ను క్లియర్ చేయమనందుకు ఓ యువకుడు ఆగ్రహంతో ఇద్దరిపై దాడి చేసి గాయపరిచిన ఘటన శనివారం రాత్రి శ్రీకాళహస్తి పట్టణంలోని దక్షిణకైలాస్‌నగర్ కాలనీలో ఉన్న ఓ ప్రైవేటు కారుపార్కింగ్ కేంద్రంలో జరిగింది. బాధితుల కథనం మేరకు శ్రీకాళహస్తి పట్టణం ఎన్టీఆర్‌నగర్‌కు చెందిన కాలేషా, చాన్‌బాషా అనే అన్నదమ్ములు కారు నడుపుకుంటూ జీవనం సాగిస్తుంటారు. పట్టణంలోని కుమారస్వామి తిప్పకు చెందిన ఓ యువకుడి వద్ద ఐదు నెలల క్రితం రూ.6లక్షలు నగదు చెల్లించి కారు కొనుగోలుచేశారు. నెల రోజుల్లో కారుపై ఉన్న ఫైనాన్స్‌ను క్లియర్ చేసి రిజిస్ట్రేషన్‌ను మార్పిస్తానని కారును విక్రయించిన యువకుడు నమ్మించాడు. ఈ క్రమంలో నెల రోజులు గడువు ముగిసిన తరువాత ఫైనాన్స్ మార్చకుండా కాలయాపన చేస్తుండటంతో కాలేషా సోదరులు యువకుడిని నిలదీశారు. ఈ క్రమంలో వారి మధ్య స్వల్ప ఘర్షణ చోటు చేసుకుని ఇరువురు పోలీసులకు ఫిర్యాదు చేసుకున్నారు. అప్పట్లో నాలుగు నెలల వ్యవధిలో ఫైనాన్స్ క్లియర్ చేయిస్తానని కారు విక్రయించిన యువకుడు కాలేషా సోదరులతో రాతపూర్వకంగా ఒప్పందం చేసుకున్నాడు. నాలుగు నెలలు గడచినా సమస్య పరిష్కారం కాకపోవడంతో శనివారం రాత్రి కారు పార్కింగ్‌లో ఉన్న యువకుడిని కాలేషా సోదరులు నిలదీశారు. ఈ క్రమంలో మళ్లీ వాగ్వాదంతో ఆగ్రహానికి గురైన యువకుడు కాలేషా సోదరులపై సిమెంట్ ఇటుకలతో దాడి చేసి గాయపరచినట్లుగా వారు చికిత్స నిమిత్తం శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో చేరారు. రెండవ పట్టణ పోలీసులు ఘటనపై విచారణచేస్తున్నారు.


ఇసుక ట్రాక్టర్‌తో
ట్రాఫిక్ ఇక్కట్లు



కాలువలో ఇరుక్కున్న ఇసుక ట్రాక్టర్

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): ఇసుక ట్రాక్టర్ చక్రం కాలువలో ఇరుక్కుపోవడంతో ప్రజలకు ఇక్కట్లు ఎదురయ్యాయి. శ్రీకాళహస్తి పట్టణంలో ట్రాఫిక్ సమస్య జనాన్ని తీవ్రంగా వెంటాడుతున్న విషయం తెలిసిందే. ఇటీవల రద్దీ వేళల్లో ఇసుక ట్రాక్టర్ల రవాణా అధికమైంది. గతంలో రద్దీ వేళల్లో పట్టణంలోకి భారీ వాహనాలను అనుమతించేవారు కాదు. ప్రస్తుతం ఇసుక ట్రాక్టర్లు సమయపాలన లేకుండా పట్టణంలో చక్కర్లు కొడుతున్నాయి. శనివారం పట్టణంలోని రిపబ్లిక్ క్లబ్ వెనుకవైపున కూరగాయలమార్కెట్ సందుకు ఇసుక ట్రాక్టరు వచ్చింది. ఇంజన్ చక్రం కాలువలో ఇరుక్కుపోవడంతో ఈ మార్గంలో సుమారు గంట పాటు రాకపోకలు స్తంభించిపోయాయి.

వేదోక్తంగా శనీశ్వరుడికి
తైలాభిషేకం



శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన శనీశ్వర స్వామికి శనివారం వేదోక్తంగా పూజలు నిర్వహించారు. స్వామి అమ్మవార్ల అభిషేకం అనంతరం శనీశ్వరస్వామి సన్నిధిలో కలశ ప్రతిష్ఠ చేసి మొదట గణపతి పూజ, కలశపూజ చేశారు. అనంతరం స్వామివారికి నువ్వుల నూనె, మంచి నూనె, పాలు, పెరుగు, చందనం, నారికేళం, కలశ జలాలతో అభిషేకం చేశారు. స్వామివారిని పలు పుష్పాలతో అలంకరించి, విశేష పూజలు నిర్వహించి ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. భక్తులు పెద్ద సంఖ్యలో స్వామివారిని దర్శించుకుని మొక్కులు సమర్పించారు. ఆలయ అధికారులు, అర్చకులు పాల్గొన్నారు.

ఆస్పత్రి ప్రారంభోత్సవంలో
ఎమ్మెల్యే ఆదిమూలం

పిచ్చాటూరు, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): గంగాధర నెల్లూరు ఎమ్మెల్యే డాక్టర్ థామస్ తిరుపతిలో నూతనంగా నిర్మించిన ఆస్పత్రి ప్రారంభోత్సవ కార్యక్రమంలో శనివారం ఎమ్మెల్యే ఆదిమూలం పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ థామస్‌కు ఆయన శుభాకాంక్షలు తెలిపి అభినందించారు. అక్కడి నుంచి స్విమ్స్ ఆస్పత్రిలో అనారోగ్యంతో చికిత్స పొందుతున్న నారాయణవనంకు చెంది న టీడీపీ సీనియర్ నేత ధర్మలింగంను పరామర్శించారు.బుచ్చినాయుడు కండ్రిగ మండలానికి చెందిన మరో టీడీపీ నేతను పరామర్శించి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్విమ్స్ వైద్యులతో మాట్లాడి మెరుగైన వైద్యం అందించాలని సూచించారు.

వైసీపీ మండల
కన్వీనర్‌కు సన్మానం

బుచ్చినాయుడుకండ్రిగ, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): మండల వైసీపీ కన్వీనర్‌గా ఎన్నికైన మణినాయుడిని ఆ పార్టీ నాయకులు స్థానిక పార్టీ కార్యాలయంలో శనివారం సన్మానించారు. మణినాయుడు మాట్లాడుతూ మండలంలో వైసీపీకి పూర్వ వైభవం తీసుకురావడానికి కృషి చేస్తానని చెప్పారు. నాయకులు రవిరెడ్డి, గురవయ్య, జయచంద్ర నాయుడు, దేవదాసురెడ్డి, కోటీశ్వరరావు, అజయ్‌కుమార్ రెడ్డి, గిరి, యుగంధర్ పాల్గొన్నారు.

ఢిల్లీలో బీజేపీ గెలుపు
దేశానికి మలుపు



శ్రీకాళహస్తిలో బీజేపీ నాయకుల సంబరాలు

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): ఢిల్లీలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఘన విజయం సాధించడం దేశానికి మలుపు అని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్ అన్నారు. శనివారం పట్టణంలోని భేరివారి మండపం వద్ద బాణసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. స్వీట్లు పంచారు. కోలా ఆనంద్ మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆధ్వర్యంలో డబుల్ ఇంజన్ సర్కార్ వలన ఢిల్లీ అభివృద్ధి వేగంగా జరుగుతుందన్నారు. బీజేపీ నాయకులు మేఘగారం సుబ్రహ్మణ్యంరెడ్డి, కొండేటి గోపాల్, గరికపాటి రమేష్‌బాబు, హరీష్‌రెడ్డి, చిలకారం గయ్య, ఢిల్లీబాబు పాల్గొన్నారు.

సత్యవేడు: స్థానిక గాంధీ విగ్రహం వద్ద బీజేపీ నాయకులు టపాకాయలు పేల్చి, స్వీట్లు పంచి పెట్టారు. బండారు మోహన్ బాబు, వెంకటేశ్వర్లు, వాసు, వెంకటేశులు రెడ్డి, రాజ, నరేంద్ర, కోటి, శివానందం, బాలాజీ పాల్గొన్నారు.

రేణిగుంట: కేఎల్ఎం ఆసుపత్రి కూడలిలో బీజేపీ నాయకులతో కలిసి రాష్ట్ర క్షత్రియ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ తేజవతి సంబరాలు నిర్వహించారు. చంద్రశేఖర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, బాలాజీ, సాయి, రాజశేఖర్, హరి, జనార్ధన్, అపర్ణ తదితరులు పాల్గొన్నారు.